
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 4 ఆగస్టు 2025

13న జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ సర్వసభ్య సమావేశం ఈనెల 13న నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు నిర్ణయించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కార్యదర్శి బీవీ రమణను ఆదేశించారు. మేయర్‌గా పీలా బాధ్యతలు చేపట్టిన తర్వాత జూన్ ఆరున కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ తరువాత పలు అంశాలపై కౌన్సిల్ నిర్ణయానికి ప్రతిపాదించాల్సి ఉంది. కమిషనర్‌గా కేతన్‌గార్గ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే తొలి సమావేశం కావడంతో అధికారులను పిలిచి కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అడిగే ప్రశ్నలకు వివరణ ఇచ్చేందుకు సమాచారం సిద్ధం చేసుకోవాలని ఆదేశించినట్టు తెలిసింది.

మహా దోపిడీ

ఫాగింగ్‌కు డీజిల్ పేరుతో అక్రమాలు

జీవీఎంసీ మలేరియా విభాగంలో మాయ

- గంటకు వంద లీటర్ల డీజిల్ వినియోగిస్తున్నట్టు లెక్కలు
- మూడు నెలల కిందట అధికారులు లెక్కించగా గంటకు 40 లీటర్లు అవుతున్నట్టు నిర్ధారణ
- ప్రతి నెలా డీజిల్ కోసం రూ.58.79 లక్షలు వ్యయం
- చాలడం లేదని అదనంగా రూ.24.69 లక్షల చొప్పున కేటాయింపు


ఫాగింగ్ వాహనాలు

- గత కమిషనర్ హయాంలో ఫిర్యాదులు రావడంతో విచారణ
- ప్రాథమికంగా అక్రమాలు నిర్ధారించిన అధికారులు
- కమిషనర్ బదిలీతో నిలిచిపోయిన చర్యలు
- కార్పొరేటర్లు, అధికారులకు వాటాలు అందుతున్నాయని ఆరోపణలు

జీవీఎంసీ పరిధిలో మెగా ఫాగింగ్ వాహనాలు	7
మినీ ఫాగింగ్ యంత్రాలు	80
పవర్ స్ప్రేయర్లు	33
నెలకు డీజిల్, పెట్రోలుకు కేటాయింపు	రూ.58.79 లక్షలు
మూడు నెలలుగా అదనపు కేటాయింపు	రూ.24.69 లక్షలు
మొత్తంగా నెలకు చూపిస్తున్న ఖర్చు	రూ.83.48 లక్షలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మలేరియా విభాగం పనితీరుపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దోమల నియంత్రణకు ఫాగింగ్ పేరుతో అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నట్టు కొందరు కార్పొరేటర్లే ఆరోపిస్తున్నారు. కాగితాలపై చూపే లెక్కలకు క్షేత్రస్థాయి పనులకు పొంతన లేదంటున్నారు. ఈ విభాగంలో అవినీతిపై గత కమిషనర్ సంపత్‌కుమార్‌కు కొందరు కార్పొరేటర్లు ఫిర్యాదుచేయడంతో మెకానికల్ విభాగం అధికారులతో విచారణ చేపట్టారు. ఇందులో అక్రమాలు వాస్తవమేనని తేలింది. బాధ్యులపై చర్యలు తీసుకునేలోగా కమిషనర్‌కు బదిలీ అయింది. తాజాగా అధికారులు మరింత అవినీతికి తెరతీసినట్టు ప్రజారోగ్యవిభాగంలోని సిబ్బందే చెబుతుండడం చర్చనీయాంశంగా మారింది.

నగరంలో దోమల నియంత్రణకు మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫాగింగ్ నిర్వహిస్తుంటారు. ఇందుకోసం జీవీఎంసీ పరిధిలో పెద్ద ఫాగింగ్ యంత్రాలు (మెగా ఫాగింగ్) ఏడు, మినీఫాగింగ్ మిషన్లు 80 ఉన్నాయి. ఇవి కాకుండా 33 పవర్ స్ప్రేయింగ్ మిషన్లతో కలిపి 120 ఫాగింగ్ యంత్రాలున్నాయి. మెగాఫాగింగ్ యంత్రంతో పెద్దరోడ్లున్న ప్రాంతాల్లో ఫాగింగ్ చేస్తారు. ఈ వాహనంతో రోజుకు ఎనిమిది గంటల చొప్పున నెలకు ఒక్కో జోన్‌లో తొమ్మిది రోజులు మాత్రమే ఫాగింగ్ చేస్తారు. టాటాఏస్‌పై అమర్చే ఈ మిషన్ ఫాగింగ్ చేయడానికి గంటకు వంద లీటర్లు, యంత్రాన్ని తీసుకెళ్లే వాహనానికి రోజుకి 20 లీటర్లు డీజిల్ ఖర్చవుతున్నట్టు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

అవినీతికి తెర తీశారు

ఇక్కడే పెద్ద అవినీతి జరుగుతోందని ఇంజనీరింగ్ అధికారులే ఆరోపిస్తున్నారు. మెగా ఫాగింగ్ యంత్రంతో ఫాగింగ్ చేయడానికి గంటకు 30 లీటర్లు అవుతుందని, యంత్రం కండిషన్ బాగా లేకుంటే గంటకు గరిష్ఠంగా 40 లీటర్లు మించదని చెబుతున్నారు. ఒక యంత్రంతో రోజుకు ఎనిమిది గంటలు ఫాగింగ్



చేస్తున్నట్టు లెక్క చూపించి, ఐదారు గంటలు మించి చేయడం లేదంటున్నారు. దీనిని బట్టి ఒక్కో మెగా ఫాగింగ్ యంత్రం వద్ద గంటకు సగటున 60 లీటర్లు చొప్పున ఆరు గంటలకు 360 లీటర్లు, ఫాగింగ్ చేయకుండానే చేసినట్టు చూపిస్తున్న రెండు గంటలకు 200 లీటర్లు మొత్తం 560 లీటర్లు పక్కదారి పడుతోందంటున్నారు. ఇవి ఏడు వాహనాలు ఉండడంతో రోజుకు 3,920 లీటర్ల డీజిల్ దారిమళ్లుతోందని చెబుతున్నారు. ఒక్కో వాహనం నెలకు తొమ్మిది రోజులు ఫాగింగ్ చేయాల్సి ఉంటుంది దీంతో నెలకు 35,280 లీటర్లు డీజిల్ పక్కదారి పడుతోందని మెకానికల్ విభాగం ఇంజనీర్లు అంచనా వేస్తున్నారు. ఇక చిన్నయంత్రాలతో ఫాగింగ్ కోసం ప్రతినెలా కనీసం రూ.35 లక్షలు పక్కదారి పడుతోందని చెబుతున్నారు.

విచారణ కమిటి తేల్చిందిదీ...

కొంతమంది కార్పొరేటర్లు తమవార్డులో సరిగా ఫాగింగ్ జరగడంలేదని, రికార్డులో ఫాగింగ్‌చేసినట్టు చూపించి డీజిల్‌ను పక్కదారి పట్టించేస్తున్నారని గత ఏడాది డిసెంబరులో అప్పటి కమిషనర్ పి.సంపత్‌కుమార్‌కు ఫిర్యాదుచేశారు. ఒక మలేరియా ఇన్‌స్పెక్టర్ డీజిల్‌ను బంకు నుంచి విడిపించి, వేరొకరి ఇచ్చే అంశంపై అప్పటి మలేరియా అధికారితో మాట్లాడినట్టు కాల్‌రికార్డు బయటపడడంతో దీనిపై విచారణ జరిపాలని సంపత్‌కుమార్ అప్పటి మెకానికల్ విభాగం ఈఈ చిరంజీవిని ఆదేశించారు. ఈ మేరకు ముగ్గురు అధికారులను వేర్వేరు ప్రాంతాల్లో ఫాగింగ్ జరుగుతున్న చోటకు వెళ్లి గంటకు ఎంతడీజిల్ ఖర్చవుతుందో పరిశీలించాలని ఈఈ ఆదేశించారు. వారంతా మెగాఫాగింగ్‌కు గంటకు 30 నుంచి 40 లీటర్లు మాత్రమే ఖర్చవుతున్నట్టు తేల్చడంతో అప్పటి కమిషనర్‌కు నివేదిక ఇచ్చారు. బాధ్యులపై కమిషనర్ చర్యలకు ... మిగతా 6వ పేజీలో

ఇంటర్‌లో పెరిగిన ప్రవేశాలు

గత ఏడాదితో పోల్చితే మెరుగుదల

- హైస్కూల్ ప్లస్‌లో కొన్నిచోట్ల సంతృప్తికరం
- అవరోధంగా మారుతున్న అధ్యాపకుల కొరత


గోపాలపట్నం ఉన్నత పాఠశాల ప్లస్-2 సెక్షన్‌లో విద్యార్థినులు

విశాఖపట్నం,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య పెరిగింది. జడ్పీ, జీవీఎంసీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహిస్తున్న హైస్కూల్ ప్లస్‌లో కొన్నిచోట్ల ప్రవేశాల్లో మెరుగుదల కనిపించగా, మరి కొన్నిచోట్ల ఎలాంటి వృద్ధి నమోదుకాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత విద్యాభివృద్ధిపై దృష్టి సారించడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగిందని భావిస్తున్నారు.**

జిల్లాలో పది ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో ఇంత వరకు ప్రథమ ఏడాదిలో 2,882 మంది విద్యార్థులు చేరారు. మరింతమంది చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. కాగా గత ఏడాది 2,816 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. పాతజైలు రోడ్డులోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఇప్పటివరకు 831 మంది విద్యార్థినులు చేరారు. దీంతో ప్రథమ, ద్వితీయ ఏడాది మొత్తం 1,470 మంది విద్యార్థినులున్నారు. కృష్ణా డిగ్రీ కళాశాలలో జనరల్, ఒకేషనల్ కలిపి 850 మంది ప్రవేశాలు పొందగా, మధురవాడ జూనియర్ కళాశాల ప్రథమ ఏడాదిలో 83 మంది చేరారు. ఇప్పటివరకు గెస్టు ఫ్యాకల్టీతోనే బోధించే ఈ కళాశాలకు ఇటీవల కొన్ని సబ్జెక్టులకు రెగ్యులర్ అధ్యాపకులు వచ్చారు. ఆనందపురం, మల్కాపురం కళాశాలల్లో 25 నుంచి 30 మంది చేరారు. గతంలో ఈ రెండుచోట్ల ప్రవేశాల సంఖ్య స్వల్పంగానే ఉండేది.

ప్రభుత్వ చర్యలతోనే...

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. తల్లికి వందనం పథకం వర్తింపచేయడం ప్రవేశాల సంఖ్య పెరగడానికి కారణమని అధ్యాపకులు చెబుతున్నారు. ఈ ఏడాది పోటీ పరీక్షలు రాసేందుకు వీలుగా విద్యార్థులకు రూ.10 వేల విలువచేసే ఐఐటీ, నీట్ మెటీరియల్ పుస్తకాలు ఉచితంగా అందజేశారు. ఒకేషనల్ కోర్సుల్లోని విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్ పుస్తకాలు అందించారు. ప్రతిరోజూ ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు తరగతులు బోధిస్తున్నారు. వారంలో మూడు రోజులు పోటీ పరీక్షలకు సంబంధించి తరగతులు నిర్వహిస్తున్నారు.

హైస్కూలు ప్లస్‌లో

జిల్లాలోని ఆరు ఉన్నత పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్ తరగతులు నిర్వహిస్తున్నారు. పీజీ అర్హత గల స్కూలు అసిస్టెంట్లతో తరగతులు బోధిస్తున్నారు. ప్రత్యేకించి ప్రిన్సిపాళ్లు లేకపోవడంతో పురోగతి కనిపించలేదు. అయితే అధ్యాపకుల నియామకం, ప్రిన్సిపాళ్ల నియామకాలను చేపట్టాలనే అభిప్రాయం ఉంది. ఈ విద్యాసంవత్సరంలో హైస్కూళ్ల ప్లస్‌లో ... మిగతా 6వ పేజీలో

ఈ ఫోన్లు మాకొద్దు!

తిరిగి అప్పగించాలని అంగన్‌వాడీ కార్యకర్తల నిర్ణయం

- నేడు సీడీపీవో కార్యాలయాల్లో అందజేతకు సన్నాహాలు
- యాప్‌ల భారం ఎక్కువవుతోందని ఆందోళన
- ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆవేదన
- అదనపు భారం మోపడంపై ఆగ్రహం


అంగన్‌వాడీలకు ఇచ్చిన మొబైల్

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందికి అందించిన ఫోన్లను వెనక్కి ఇచ్చేందుకు సిద్ధపడుతున్నారు. కేంద్రాల ద్వారా అమలుచేసే పథకాలు, లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు 2018లో అప్పటి ప్రభుత్వం ఈ ఫోన్లను అందించింది. ప్రభుత్వం సూచించిన పోషణట్రాకర్, బాల సంజీవని యాప్‌ల్లో కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు అందించే రేషన్, ఇతర వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించింది. అయితే కొన్నాళ్లుగా ఫోన్లు సరిగా పనిచేయడం లేదని, యాప్‌ల భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది వాపోతున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం కనిపించలేదంటున్నారు.

గతంలో లబ్ధిదారుల కుటుంబసభ్యుల్లో ఎవరు వచ్చినా రేషన్ ఇచ్చే పరిస్థితి ఉండేదని, ఫొటో తీసి అప్‌లోడ్ చేసే అవకాశం ఇచ్చారని, ఇప్పుడు లబ్ధిదారుకు మాత్రమే పరిమితం చేశారని వాపోతున్నారు. ప్రసవం తరువాత కొంతమంది రాలేని పరిస్థితి ఉందని,దీంతో వారి ఇళ్లకువెళ్లి రేషన్ ఇవ్వాల్సి వస్తోందంటున్నారు. దీంతో ఒక్కో లబ్ధిదారుకు కనీసం 20 నిమిషాలు వెచ్చించాల్సి రావడంతో కేంద్రాల నిర్వహణపై దృష్టి సారించలేకపోతున్నామంటున్నారు. ఈ ఇబ్బందుల ను పరిష్కరించేందుకు కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరినా అధికారులు స్పందించడం లేదంటున్నారు.

అదనపు భారంపై ఆగ్రహం

ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం అమలు బాధ్యతను అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ పథకాన్ని అమలు చేయలేమని, మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లాలోని కార్యకర్తలు తమ పరిధిలోని సీడీపీవో కార్యాలయాలకు వెళ్లి స్మార్ట్‌ఫోన్లను వెనక్కి ఇచ్చేయాలని నిర్ణయించారు. గతంలో మాదిరిగా కేంద్రాలకు సంబంధించిన వ్యవహారాలను రిజిస్టర్‌లో రాస్తామని, కొత్త ఫోన్లు ఇచ్చే వరకు ఆఫ్‌లైన్‌లోనే వివరాలు నమోదు చేస్తామంటున్నారు. జిల్లాలో 776 అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లను అందించింది.

ఇవీ డిమాండ్లు..

ప్రస్తుతం ఉన్న యాప్‌లన్నింటినీ కలిపి ఒకే యాప్ తీసుకురావాలని, ఎఫ్ఆర్ఎస్ ఇన్, ఔట్ ... మిగతా 6వ పేజీలో

తీరంలో స్నేహితుల సందడి

నగరంలో ఆదివారం స్నేహితులు సందడి చేశారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా హోటల్స్, రిసార్ట్స్, రెస్టారెంట్స్‌లో పార్టీలు జరిగాయి. ఆర్‌కే బీచ్, వీఎంఆర్‌డీఏ పార్క్, రుషికొండ, కైలాసగిరి తదితర ప్రాంతాల్లో సందడి వాతావరణం కనిపించింది. యువతీ, యువకులు తీరానికి చేరుకుని ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బాండ్స్ కట్టుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కేకులు కట్ చేసి తినిపించుకున్నారు. షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్ల వద్ద సందడి చేశారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



నిరంతర పర్యవేక్షణ

ఆస్పత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లపై అధికారుల దృష్టి

- సృష్టి వ్యవహారం నేపథ్యంలో ఆరోగ్యశాఖ నిర్ణయం
- తనిఖీ బాధ్యతలు ప్రొగ్రామ్ ఆఫీసర్లకు అప్పగింత



విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): **జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, ఫెర్టిలిటీ సెంటర్లు, సరోగసీ కేంద్రాలపై ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. వీటిని నిరంతరం పర్యవేక్షించేలా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ప్రొగ్రామ్ ఆఫీసర్లకు బాధ్యతలను అప్పగించారు.**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సృష్టి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా ఆరోగ్యశాఖతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఫెర్టిలిటీ సెంటర్లు, సరోగసీ కేంద్రాలపై దృష్టిసారించాలని, నిబంధనలు పాటించని వాటిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అదే సమయంలో నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఈ మేరకు ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీల కోసం అధికారులను నియమించారు. వీరిలో డెమో, జిల్లా ప్రొగ్రామ్ ఆఫీసర్, జిల్లా ఉమెన్ హెల్త్ ఆఫీసర్ ఉన్నారు. వీరంతా తొలుత జిల్లాలో ఉన్న 53 ఫెర్టిలిటీ సెంటర్లు, సరగోసీ కేంద్రాలను ... మిగతా 6వ పేజీలో

యూసీడీలో దోపిడీపై ఆరా!

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ఆడిట్ పేరుతో జీవీఎంసీ యూసీడీ అధికారులు, సిబ్బంది దోపిడీపై మెప్మా ఉన్నతాధికారులు, కమిషనర్ కేతన్‌గార్గ్ ఆరా తీసినట్టు తెలిసింది. మహిళా సంఘాల్లో గత ఏడాది జరిగిన ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు రుణాలు, పొదుపు మొత్తం తదితరాలను తెలుసుకునేందుకు మెప్మా ఎండీ తేజ్‌భరత్ అన్ని గ్రూపులను ఆడిట్‌చేయాలని ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా రెండు ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించారు. ఆడిట్‌చేసే ఏజెన్సీలకు ప్రతి గ్రూపు నుంచి రూ.300 చెల్లించాలని ఉత్తర్వులు జారీచేశారు. జీవీఎంసీ పరిధిలో కొద్దిరోజులుగా ఆడిట్ జరుగుతోంది. ఆడిట్ ... మిగతా 6వ పేజీలో

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం పదిగంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజా సమస్యలపై వినతులు స్వీకరిస్తారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన రశీదు తీసుకురావాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ సూచించారు. సమస్య పరిష్కారమైతే అర్జీదారుని ఫోన్‌కు సమాచారం వస్తుందని, నోటీసులు, ఎండార్స్‌మెంట్‌లు వాట్సాప్ ద్వారా పంపుతున్నామని అన్నారు. సమస్య పరిష్కారం స్టేటస్ కోసం అర్జీదారులు 1100 నంబరుకు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు.

దేవరాపల్లిలో వైసీపీ జడ్పీటీసీ సభ్యుల సమావేశం రేపు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ జడ్పీటీసీ సభ్యుల సమావేశం ఈ నెల ఐదో తేదీన దేవరాపల్లి మండలం మామిడిపల్లిలో జరగనున్నది. వైసీపీ జడ్పీటీసీ సభ్యుల ఫోరం అధ్యక్షుడు కర్రి సత్యం (దేవరాపల్లి సభ్యుడు) అధ్యక్షతన సమావేశంకానున్నారు. గ్రామ దేవత పండుగతోపాటు ఫోరం అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా ఆయన ఉమ్మడి జిల్లాలో వైసీపీ జడ్పీటీసీ సభ్యులకు ఆహ్వానం పంపారు. అయితే జడ్పీ చైర్‌పర్సన్‌కు, వైసీపీ జడ్పీటీసీ సభ్యులకు మధ్య విభేదాలు ఉన్న నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహించడం పలు ఊహాగానాలకు తావిస్తున్నది.

మెకానికల్‌లో అడ్వైజర్ గోల

జీవీఎంసీ వాహనాల నిర్వహణపై సలహాలకు ప్రైవేటు వ్యక్తి

- ఈ ఏడాది మార్చి వరకు పనిచేసిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి
- పొడిగింపు ఉత్తర్వులు లేకున్నా గత నెల ఒకటి నుంచి విధుల్లోకి
- ఉన్నతాధికారి అండదండలతోనే కొనసాగింపు?

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మెకానికల్ విభాగంలో అడ్వైజర్ నియామకం గందరగోళం రేపుతోంది. జీవీఎంసీ వాహనాల పర్యవేక్షణకు గత ఏడాది మార్చిలో అప్పటి కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆర్టీసీ మెకానికల్ విభాగంలో విశ్రాంత ఉద్యోగిని ఏడాది కాలానికి అడ్వైజర్‌గా నియమించారు. ఈ ఏడాది మార్చితో అతని గడువు ముగిసింది. తాజాగా గతనెల ఒకటి నుంచి ఈ విభాగంలో మళ్లీ హడావుడి ప్రారంభించారు. కమిషనర్‌తో జరిగే సమీక్షలకు కూడా హాజరవుతున్నారు. నియామక ఉత్తర్వులు లేకపోయినా గొంతెమ్మ కోర్కెలను తీర్చాలని ఒత్తిడి చేస్తున్నారంటూ ఆ విభాగం అధికారులు, సిబ్బంది గగ్గోలు పెడుతున్నారు.

ప్రజారోగ్యం, యూజీడీ, హర్టీకల్చర్, టౌన్‌ప్లానింగ్ విభాగాలతోపాటు అధికారులు విధి నిర్వహణలో తిరిగేందుకు అవసరమైన కార్లు జీవీఎంసీకి ఉన్నాయి. వీటి నిర్వహణ, మరమ్మతులను మెకానికల్ విభాగం చూస్తుంటుంది. ఈ విభాగంలో కొందరు అధికారులు, సిబ్బంది కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. వీటికి అడ్డుకట్టవేయడంతోపాటు వాహన మరమ్మతులను గుర్తించి, ప్రతిపాదనల మేరకు, కాంట్రాక్టర్లతో పూర్తిచేయించే బాధ్యతలను ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగికి అప్పగించారు. అతనికి గౌరవభత్యం కింద నెలకు సుమారు రూ.లక్షతోపాటు కారు సదుపాయం కల్పిస్తూ, ఏడాదికాలానికి నియమించారు. ఈ ఏడాది మార్చితో అడ్వైజర్ గడువు ముగిసింది. తర్వాత పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో సర్వీసు పొడిగించలేదు. అప్పటినుంచి మెకానికల్ విభాగం ఇంజనీర్లే వాహన మరమ్మతులను చూసుకుంటున్నారు. కానీ గతనెల ఒకటి నుంచి అదే ఉద్యోగి



హడావుడి చేస్తున్నారు. తనను కమిషనర్ నియమించారని చెబుతూ, మెకానికల్ విభాగంపై కమిషనర్ నిర్వహించే సమీక్షలకు కూడా హాజరైపోతున్నారు. నెల రోజులు గడిచినా నియామక ఉత్తర్వులు జారీకాకపోవడంతో అధికారుల్లో అనుమానం మొదలైంది.

గొంతెమ్మ కోర్కెల చిట్టా

అడ్వైజర్‌గా చెప్పుకుంటున్న వ్యక్తి గొంతెమ్మ కోరికలు కోరుతున్నారని అధికారులు వాపోతున్నారు. కాలపరిమితి ముగిసినా జీవీఎంసీకి కారు అప్పగించలేదు. పైగా అది ప్రైవేటు కాంట్రాక్టర్ కారు కావడంతో నాలుగునెలల బిల్లు చెల్లించాలని ఒత్తిడిచేస్తున్నారు. పోస్టు శాంక్షన్ కాకుండా బిల్లు పెట్టలేమని అధికారులు చెబుతున్నా, జీవీఎంసీలో ఉన్నతాధికారి అండదండలున్నాయని, అతని ద్వారా కమిషనర్‌కు చెప్పిస్తానంటున్నారు. దీంతో మెకానికల్ విభాగం అధికారులు, సిబ్బంది ఎదురు ... మిగతా 6వ పేజీలో



గరుడ వాహనంపై ఉన్న స్వామివారికి పూజలు చేస్తున్న వైదికులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణలు చేశారు. భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నారసింహ అష్టోత్తర శత నామావళి పఠిస్తూ అన్ని నామాలకు సిరి సంపెంగలతో పూజలు జరిపారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. అంతకముందు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి నారసింహ అష్టోత్తర శతనామావళితో అర్చన జరిపారు. భక్తులు గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

రుషికొండ బీచ్‌లో సండే సందడి



సందర్శకులతో కిటకిటలాడుతున్న రుషికొండ బీచ్

సాగర్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లు సందర్శకులతో ఆదివారం కిటకిటలాడాయి. ఎండల తీవ్రత, ఉక్కపోత అధికంగా ఉండడంతో నగరంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొందరు స్నానాలు చేస్తూ సరదాగా గడపగా, మరికొందరు పచ్చికపై కూర్చుని సముద్రం అందాలను ఆస్వాదించారు. మరికొందరు బోటు షికార్‌లో తిరిగారు.

ఇద్దరిని రక్షించిన లైఫ్‌గార్డులు



ప్రమాదం నుంచి బయటపడిన యువకులతో లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగి ప్రమాదానికి గురైన ఇద్దరిని లైఫ్‌గార్డులు రక్షించారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అంకుర్ కుమార్ (30), గౌతమ్ సాహు (29) ఆదివారం రుషికొండ బీచ్‌కు విహార యాత్రకు వచ్చారు. బీచ్‌లో కాసేపు సరదాగా గడిపిన తరువాత సముద్ర స్నానాలకు దిగారు. పెద్ద అల తాకిడికి ఇద్దరూ లోపలకి కొట్టుకుపోతుండగా సమీపంలో ఉన్న విధులు నిర్వర్తిస్తున్న లైఫ్‌గార్డులు గమనించి, వారిని రక్షించారు.

వృద్ధురాలు ఆత్మహత్యాయత్నం

సాగర్‌నగర్ బీచ్‌లో ఆదివారం సాయంత్రం వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా లైఫ్‌గార్డు, మెరైన్ కానిస్టేబుల్ అడ్డుకున్నారు. గోరల కళావతి (80) అనారోగ్య సమస్యలు తాళలేక సాగర్‌నగర్ బీచ్ లో కెరటాల్లోకి దిగుతుండగా సమీపంలో విధుల్లో ఉన్న మెరైన్ కానిస్టేబుల్ వెంకట గణేష్, లైఫ్ గార్డు బుజ్జి గమనించి ఆమెను ఒడ్డుకు తీసుకువచ్చారు. ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇచ్చి వృద్ధురాలిని వారి సమక్షంలో కుటుంబీకులకు అప్పగించారు.

పాత మెట్ల మార్గాన్ని పునరుద్ధరించాలి



వ్యాపారాలు లేక మూసి ఉన్న దుకాణాలు

సింహాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి దుకాణ సముదాయానికి ఆనుకుని దక్షిణ వైపు పీఆర్ఓ కార్యాలయానికి ఎదురుగా ఉన్న మెట్ల మార్గాన్ని పునరుద్ధరించాలని వ్యాపారులు కోరుతున్నారు. దక్షిణ మెట్ల మార్గం లేకపోవడంతో భక్తులు రాకపోకలు నిలిచిపోయి దుకాణ సముదాయంలోని వ్యాపారులకు వ్యాపారాలు సాగడం లేదు. కనీసం దుకాణాల్లో పనిచేసే వారికి కూలి ఇచ్చేందుకు కూడా యజమానులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దుకాణ సముదాయం మధ్య నుంచి జోడుభద్రాల మీదుగా ఉన్న మార్గం కూడా చందనోత్సవ దుర్ఘటన వల్ల మూసివేశారు. శని, ఆదివారం కొద్దిపాటి వ్యాపారాలు సాగినా మిగిలిన రోజుల్లో అమ్మకాలు లేక దుకాణాలు మూసివేస్తున్నారు. దేవస్థానం అధికారులు స్పందించి దక్షిణ మార్గంలోని మెట్ల మార్గాన్ని పునరుద్ధరించాలని వ్యాపారులు కోరుతున్నారు.

పూడికతీత పనుల్లో అలసత్వం సరికాదు

పారిశుధ్య విభాగం అధికారులపై ఎమ్మెల్యే గంటా ఆగ్రహం

మధురవాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మధురవాడలో పూడికతీత పనులు నెలలు తరబడి కొనసాగడం పట్ల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. 5, 6, 7 వార్డుల పరిధిలో రెండు నెలల కిందట జీవీఎంసీ అధికారులు ఫుట్‌పాత్‌ల కింద ఉన్న కాలువల్లో పూడికతీతలను ప్రారంభించారు. ఈ పనులు మందకొడిగా సాగుతున్నాయి. అలాగే సర్వీసు రోడ్డుకు ఇరువైపులా కాలువలపై కొన్నిచోట్ల పలకలు లేకపోవడంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎమ్మెల్యే గంటా, వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మతో కలిసి ఆదివారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. కాలువల్లో పూడికలు నిండిపోవడంతో పారిశుధ్య విభాగం అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ మంగమ్మ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకట్రావు చంద్రంపాలెం వద్ద కాలువల్లో పూడికలను ఎమ్మెల్యేకు చూపించారు. ఆయన వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే పూడికతీత చేయించాలని ఆదేశించారు. కాలువల్లో పూడికల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. సర్వీసు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లపై వెంటనే సిమెంటు పలకలు వేయించాలని ఆదేశించారు.



కాలువలో పూడికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

నిధులున్నా.. ప్రారంభం కాని సంగివలస రోడ్డు పనులు

తగరపువలస, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డులోని సంగివలస నుంచి సామేయవలస వరకు ఉన్న రహదారి వెడల్పు కోసం రూ. కోటి మంజూరైనా నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఏడు నెలలు క్రితం ఈ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. టెండర్లు కూడా పిలిచారు. కానీ ఈ రహదారిని 40 అడుగుల మేర వెడల్పు చేయడానికి వీలుగా రహదారి పక్కన ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. రహదారి మధ్యలో విద్యుత్ స్తంభం కూడా ఉంది. ఈ పనులు చేస్తే తప్ప నిర్మాణం ప్రారంభించలేనని కాంట్రాక్టరు చేతులు ఎత్తేశారు. రోడ్డు మొత్తం గోతులతో ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పద్మనాభం మండలం నుంచి వందలాది లారీలు ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటాయి. వివిధ కళాశాలలకు చెందిన బస్సులు, ట్యాంకర్లు కూడా తిరుగుతుంటాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు రహదారి పక్కన ఆక్రమణలు తొలగించి, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



గోతులతో అధ్వానంగా ఉన్న సంగివలస రోడ్డు



వీధిలో కుక్కల గుంపు

బాబోయ్.. కుక్కలు

సింహాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ముఖ్యంగా స్వామివారి కల్యాణ మండపం నుంచి ప్రియాగార్డెన్స్‌లోకి వెళ్లే మార్గంలో, బంగారమ్మ తల్లి ఆల యం నుంచి శిడగంపేట వైపుగా వెళ్లే మార్గంలోను, పోస్టాఫీసు వీధిలో కుక్కలు సంచారం అధికంగా ఉంది.ఆయా ప్రాంతాల్లో గుంపు గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారిపై దాడికి పాల్పడుతున్నాయి. కొన్నిసార్లు వాహనాల వెంట పరుగులు తీస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. కుక్కల ధాటికి భయపడి మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఇళ్లల్లో నుంచి బయటకు రావాలంటేనే భయపడు తున్నారు.

అంబేడ్కర్ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

కొమ్మాది,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది రిక్షా కాలనీలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పలు తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 5వ తరగతిలో ఎస్సీ కేటగిరీలో 50 సీట్లు, పదో తరగతిలో 3 సీట్లు, జూనియర్ ఇంటర్ ఎస్సీ కేటగిరీలో 50 సీట్లు, సీనియర్ ఇంటర్‌లో ఎస్సీ కేటగిరీలో 21 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఆసక్తి గల వారు సోమవారం కళాశాలలో నేరుగా సంప్రతించాలని ఆమె సూచించారు.

కృష్ణాపురం యువకుడికి కానిస్టేబుల్ ఉద్యోగం

పద్మనాభం రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన కొమ్ము రవితేజ్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు, నిరుపేద దళిత కుటుంబానికి చెందిన రవితేజ్ ఎలాంటి కోచింగ్‌కు వెళ్లకుండా స్వయం కృషితో ఉద్యోగం సాధించాడు.విశాఖ సిటీ పరిధిలో 142 మార్కులతో 60వ ర్యాంకు సాధించాడు. ఆయన తండ్రి కనకరాజు తాపీమేస్త్రీ కాగా తల్లి గోవిందమ్మ వ్యవసాయ కూలి. రవితేజ్‌ను తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

'ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న వైసీపీ భీమిలి ఇన్‌ఛార్జి చిన్న శ్రీను

పద్మనాభం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడంలో విఫలమైందని వైసీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. మద్ది గ్రామంలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో అన్ని పథకాలు సమయానికి అందేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం, భీమిలి ఎంపీపీలు కె.రాంబాబు, వాసురాజు, జెడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్. గిరిబాబు, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కె. వెంకటరావు, మద్ది, గంథవరం సర్పంచులు సన్యాసమ్మ, వర్మ, నాయకులు గాడు శ్రీను, సత్యనారాయణ, బంగారప్పడు, పద్దు, శివరామకృష్ణ, రామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

హెరిటేజ్ ఫెస్ట్ సాంస్కృతిక కార్నివాల్ ప్రారంభం



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఆనందపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో రాధా మదన్‌మోహన్ మందిరంలో హెరిటేజ్ ఫెస్ట్ - 2025 సాంస్కృతిక కార్నివాల్ వేడుకలు శనివా రం నుంచి ప్రారంభమయ్యాయి. వేడుకలు ఈనెల 11వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. వివిధ రంగాల్లో బాల బాలికలకు పోటీలు నిర్వహించి, చివరి రోజున విజేతలకు బహుమతులు అందిస్తామని గంభీరం హరేకృష్ణ వైకుంఠం అధ్యక్షుడు అంబరీష దాస తెలిపారు. 4న పౌరాణిక వేషధారణ పోటీలు, 5న భగవద్గీత శ్లోక పఠనం, 6న గాత్ర సంగీతం, 7న నాటకాలు, 9న శాస్త్రీయ నృత్యం (బృందం, వ్యక్తిగతంగా), 11న కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ వంటి పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 9985364430, 8790160232 సెల్ నంబర్లను సంప్రతించాలని ఆయన సూచించారు. కాగా శనివారం జరిగిన చిత్రలేఖనం పోటీల్లో సుమారు 600 మంది బాల బాలికలు పాల్గొన్నారు.

సభాపతి గౌరవానికి భంగం కలిగించలేదు

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్



మాట్లాడుతున్న మూర్తి యాదవ్

సీతంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సభాపతి అయ్యన్న పాత్రుడుకి క్షమాపణ చెబుతున్నానని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు.ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఎప్పుడూ మాట్లడలేదని పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయ్యన్నకు అన్యాయం చేసిన వైసీపీ వ్యక్తులకే కూటమి ప్రభుత్వంలో అప్పనంగా మాజీ సైనిక ఉద్యోగి భూమికి ఎన్‌ఓసీ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశానన్నారు. రాయలసీమ వ్యక్తికి మాజీ సైనికోద్యోగిగా విశాఖలో భూమి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అయ్యన్న తమ్ముడి కుమారుడు, వైసీపీ సానుభూతిపరుడు వరుణ్ ఈ వ్యవహారం నడిపారని, కూటమిలో రూ. 100 కోట్ల విలువైన భూములు ఫాబ్రికెట్ చేసి కొట్టేశారన్నారు. సన్యాసిపాత్రుడికి మేలు చేసేలా అధికారులు సహకరించారన్నారు. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



కాలువపై వేసిన తాటి దూలం

కాలువపై పలకలు లేక ఇబ్బందులు

ఆనందపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములవలస పంచాయతీలో గెడ్డ కాలువపై పలకలు నిర్మించకపోవడంతో ఎస్సీ, బీసీ కాలనీల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు కాలనీల్లో సుమారు వంద ఇళ్లు ఉన్నాయి. ఒకవైపు 50, మరోవైపు 50 ఇళ్లు ఉండగా, మధ్యలో గెడ్డ వాగు ఉంది. పలకలు లేకపోవడంతో స్థానికులు గెడ్డపై తాటి దూలం వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. గెడ్డ వాగు దాట లేక చాలామంది చిన్నారులు, వృద్ధులు గాయపడుతున్నారు. గత నాలుగున్నర ఏళ్లుగా ఈ పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇంటర్‌లో పెరిగిన ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

రెండుమూడు చోట్ల ప్రవేశాలు పెరిగాయి. గాజువాకలో ఎంపీసీ 26, బైపీసీ 42 మొత్తం 68 మంది, గోపాలపట్నంలో ఎంపీసీ, బైపీసీలో 95 మంది చేరారు. రాంపురంలో ఏంపీసీలో ఒకరు, బైపీసీలో ముగ్గురు మాత్రమే చేరారు. గంగవరంలో ఎంపీసీలో కేవలం ఐదుగురు ఉండగా, బైపీసీలో 18మంది చేరారు. మల్కాపురంలో ప్రథమ ఏడాది ప్రవేశాలు లేవు. ఇక్కడ ద్వితీయ ఏడాదిలో 22 మంది అదే ప్రాంగణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులకు హాజరవుతున్నారు. సీతమ్మధార ఎస్‌ఎంసీ పాఠశాలలో రెండు గ్రూపులకు ప్రథమ ఏడాదిలో 20మంది చేరారు. ఇక్కడ ఏడుగురు పీజీటీలుండగా నలుగురికి హెచ్‌ఎంలుగా పదోన్నతి రావడంతో ఉన్న ముగ్గురే పాఠాలు బోధిస్తున్నారు.

ఈ ఫోన్లు మాకొద్దు!

... 5వ పేజీ తరువాయి

రద్దుచేయాలని, కేంద్రాల నిర్వహణకు 5జీ నెట్‌వర్క్‌తో కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని కోరుతున్నారు. వేతనాలు పెంచాలని, మినీల్లో పనిచేసేవారిని మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీవో విడుదల చేయాలని, గ్రాట్యూటీ జీవోలో మార్పులు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు గైడ్‌లైన్స్ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం అధికారులకు వినతిపత్రాలు అందించాలని నిర్ణయించారు.

మహా దోపిడీ

... 5వ పేజీ తరువాయి

సమాయత్తమవుతున్న సమయంలో బదిలీ అయిపోయింది.

అక్రమాలపై ఆరోపణలు

ఫాగింగ్‌లో అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలుండగా, నిధులు చాలడం లేదని అదనంగా కేటాయించాలని మలేరియా విభాగం అధికారులు జీవీఎంసీ ఉన్నతాధికారులకు విన్నవించినట్టు తెలిసింది.ఫాగింగ్‌కు నెలకు రూ.58.79 లక్షలు కేటాయిస్తుండగా, మూడు నెలలుగా అదనంగా రూ.24.69 లక్షలు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. ఫాగింగ్ పేరుతో కొంతమంది అధికారులు, సిబ్బంది నిధులను నొక్కేస్తున్నారని కొందరు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఇందులో కొందరు కార్పొరేటర్లకు, అధికారులకు వాటాలు అందుతుండడంతో అక్రమాలకు అండగా నిలుస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరాధార ఆరోపణలు

ఫాగింగ్ పేరుతో జరుగుతున్న అక్రమాలపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా అక్రమాలు జరగడానికి అవకాశమే లేదని కొట్టిపారేశారు. గిట్టనివారే ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. మలేరియా విభాగంలో ప్రస్తుతం ఆరు మెగా ఫాగింగ్ యంత్రాలతోనే ఫాగింగ్ జరుగుతోందన్నారు. గంటకు వందలీటర్లు డీజిల్ ఖర్చవుతోందని గత కమిషనర్ విచారణలో కూడా తేలిందని చెప్పడం కొసమెరుపు.

నిరంతర పర్యవేక్షణ

... 5వ పేజీ తరువాయి

నిరంతరం పర్యవేక్షించేలా ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజూ ఐదు కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల్లో జరిగిన ప్రతి కేసుకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. సృష్టి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు ఆధ్వర్యంలో 11 ఫెర్టిలిటీ సెంటర్లు, సరోగసీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మిగిలిన వాటిని అధికారులు తనిఖీ చేయనున్నారు.

రెండో దశలో ఆస్పత్రుల తనిఖీ

మొదటి దశలో సరోగసీ, ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు నిర్వహించేలా నిర్దేశించారు. రెండో దశలో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, డెంటల్ హాస్పిటల్స్‌లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డెంటల్ క్లినిక్స్ 252 ఉన్నాయి. వీటిని నిరంతరం పర్యవేక్షించేలా సదరు అధికారులకు ఆదేశాలు అందాయి. ఫెర్టిలిటీ సెంటర్లు, సరగోసీ కేంద్రాలకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నట్టు సమాచారం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు ఆయా కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఏదైనా సమస్య వెలుగులోకి వచ్చిన తరువాత అధికారులు హడావిడి చేయడం, తరువాత పక్కన పెట్టేయడం పరిపాటిగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మెకానికల్‌లో అడ్వైజర్ గోల

... 5వ పేజీ తరువాయి

చెప్పేందుకు సాహసించలేకపోతున్నారు. అంతేకాకుండా ఈ విభాగంలోని వాహనాల మరమ్మతులకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కమిషనర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులకు తెలిసేలా ఒక ప్రైవేటు ఏజెన్సీ రూపొందించిన యాప్‌కు బిల్లు చెల్లించాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. ఇటీవల మెకానికల్ విభాగంపై కమిషనర్ సమీక్ష నిర్వహించినపుడు ఈ యాప్‌పై సూచించినట్టు చెబుతున్నారు. గతంలో 'ఇంట్రోల్యాబ్స్' అనే సంస్థ అభివృద్ధిచేసిన యాప్‌ను వాహన రిపేర్లను ట్రాకింగ్ చేయడానికి వినియోగించేవారు. అందుకోసం ఏజెన్సీకి జీవీఎంసీ నుంచి నెలకు రూ.70 వేలు చెల్లించేవారు. గత ఆరు నెలలుగా ఆ యాప్ పనిచేయడంలేదు. తాజాగా అదే యాప్ సేవలను వినియోగించుకుంటే పనిచేయని ఆరునెలలకు బిల్లు పెట్టించి కొట్టేయవచ్చని కమిషనర్ వద్ద ప్రస్తావించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెకానికల్ విభాగంలో అనుభవం, నైపుణ్యం ఉన్న ఇంజనీర్లుండగా, ప్రైవేటు వ్యక్తికి నియమించాల్సిన అవసరమేమిటని ఆ విభాగం అధికారులు ప్రశ్నిస్తున్నారు.

యూసీడీలో దోపిడీపై ఆరా!

... 5వ పేజీ తరువాయి

ఫీజుగా రూ.300కు బదులు యూసీడీ సిబ్బంది రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని మహిళా సంఘాల సభ్యులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల ఒకటిన 'యూసీడీ దోపిడీ' శీర్షికన కథనం ప్రచురితమయింది. దీనిపై స్పందించిన మెప్మా ఎండీ, జీవీఎంసీ కమిషనర్ వేర్వేరుగా యూసీడీ పీడీకి ఫోన్‌చేసి ఆరా తీసినట్టు తెలిసింది. విచారణ జరిపి బాధ్యులను గుర్తించి నివేదిక పంపాలని ఆదేశించినట్టు సమాచారం. ఈమేరకు యూసీడీ పీడీ సత్యవేణి జోన్‌లవారీగా విచారణ జరిపారు. కొన్నిచోట్ల అదనంగా రూ.200 వసూలు చేసినట్టు తేలిందని కొంతమంది యూసీడీ సిబ్బంది చెబుతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కొరాడలో ప్రచారం చేస్తున్న సమితి సభ్యులు

పద్మనాభం,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొరాడ, సుంకరిపేట గ్రామాల్లో ప్రబోదానంద సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక విజయ రాంపురం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 16న జరిగే కృష్ణాష్టమి విశిష్టత గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు త్రినాథరావు, సభ్యులు రాజు, శ్యామ్, సంతోష్, లక్ష్మి, బంగారుతల్లి, మంగమ్మ పాల్గొన్నారు.

వినాయక నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

సింహాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డు ఆయిల్ మిల్లు ఎదురుగా గణేశ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభంకానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఆదివారం పందిరి రాట వేశారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 40 ఏళ్లు ఇక్కడ గణపతి నవరాత్రులు, దుర్గాదేవి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ వ్యవస్థాపకుడు గంట్ల తమ్మయ్య, పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం



శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

తగరపువలస, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని కరీంనగర్ జిల్లాకు చెందిన మైక్రో బయాలజీ విభాగం అధిపతి డా. పట్ట అప్పారావు అన్నారు. ఆదివారం చిట్టివలసలో జరిగిన ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని అందుకు అనుగుణంగా చదివినప్పుడే అనుకున్న ఫలితాన్ని సాధిస్తారని చెప్పారు. అనంతరం నిర్వాహకులు అప్పారావును సన్మానించారు.

మిత్రునికి ఆర్థిక సాయం

భీమునిపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి సభ్యులు అనారోగ్యంతో ఉన్న తమ స్నేహితుడికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందించారు. శిషక్ యానిక్ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్నారు. పేద కుటుంబానికి చెందిన ఆయన ప్రతి నెల మందులు వాడాల్సి ఉండడంతో స్నేహితులంతా కలిసి ఆర్థిక సాయం చేశారు.



కాలువలో మృతదేహం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇసుకతోట పెట్రోలు బంకు సమీపంలోని డ్రైనేజీలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎంవీపీ పోలీసులు వివరాలు ఆరా తీశారు. అతడ్ని శివాజీపాలెం సాయిబాబా ఆలయం ప్రాంతీయుడు ఉల్లి పోలిరాజు(38)గా గుర్తించారు. శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన పోలిరాజు రాత్రి తొమ్మిది గంటలప్పుడు తనతో ఫోన్ మాట్లాడుతూ ఒక్కసారిగా అరిచాడని, తర్వాత ఫోన్ కట్ అయ్యిందని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తర్వాత వివిధ చోట్ల అతడి కోసం వెతికామని, ఆచూకీ తెలియలేదని పేర్కొంది. ఆదివారం తెల్లవారు జామున రెండున్నర గంటల సమయంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

పాయకరావుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో చెప్పకుండా ఆదివారం దువ్వాడలో రైలు ఎక్కిన ఇద్దరు బాలికలను తునిలో ప్రభుత్వ రైల్వే పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని అగనంపూడికి చెందిన ఇద్దరు బాలికలు ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లిపోయారని సమాచారం అందడంతో తుని రైల్వే స్టేషన్ సిబ్బంది ఎన్. నానిబాబు, మోహనరావు రైళ్లలో తనిఖీ చేయడం ప్రారంభించారు. అలానే బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు బాలికలను కనుగొని వారిని రైలు నుంచి దించారు. స్టేషన్‌కు తీసుకువచ్చి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా రైలు ఎక్కాలని నిర్ణయించుకుని దువ్వాడ స్టేషన్‌లో రైలు ఎక్కామన్నారు. దీంతో వారి తల్లిదండ్రులను తుని రైల్వే పోలీస్ స్టేషన్‌కి పిలిపించి, ఇద్దరు బాలికలను అప్పగించినట్టు ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఈనెలలో 147 మంది పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెలలో 147మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్నారు. సాధారణంగా ప్లాంట్‌లో జూన్, జూలై నెలల్లో పదవీ విరమణలు ఎక్కువగా ఉం టాయి. కానీ ఈ ఏడాది రికార్డు స్థాయిలో జూన్ నెలలో 238 మంది, జూలైలో 121 మంది ఉద్యోగులు రిటైరయ్యారు. మళ్లీ ఈ నెల మరో 147మంది పదవీ విర మణ చేయనున్నారు. ఒకేసారి ఇంత మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో పాటు రానున్న రోజుల్లో రెండో వీఆర్ఎస్ ద్వారా మరికొంత మంది ఉద్యోగులు ఉద్యోగాలను వీడనున్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50,బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186



ఆర్కే బీచ్‌లో విద్యార్థినుల సందడి



కేక్ కట్‌చేస్తున్న కస్తూరి మహిళా మండలి సభ్యురాలు

సాగర తీరంలో స్నేహ వీచిక

బీచ్ రోడ్డు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అందమైన సాగరతీరం ... ఎదురుగా పలకరిస్తూ వెళ్లిపోయే కెరటాలు... చల్లచల్లని గాలి... స్నేహితులు కబుర్లు చెప్పుకోవడానికి ఇంతకు మించిన స్థలం ఏముంటుంది? యువతను చూడండి.. ఆనందాన్ని దోసిళ్లతో తామే ఒడిసి పట్టుకున్నట్లుగా ఎంత చక్కగా తుళ్లింతలతో కనిపిస్తున్నారో... ఆదివారం స్నేహితుల పండుగ కదా! యువత ఆటపాటల్లో మునిగిపోయారు. కొందరు గుంపులుగా తరలివచ్చి సెల్ఫీలతో సందడి చేశారు. సముద్రంలో తడుస్తూనే యువత కేరింతలు కొట్టారు. సెలవు రోజు కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు ఆర్కే బీచ్‌లో సందడి చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరావడంతో బీచ్ ప్రాంతం కోలాహలంగా మారింది. సముద్రంలో స్నానం చేయడానికి ఎక్కువమంది ఆసక్తి చూపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లు, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



తీరంలో మహిళల ఆనందం



స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్న సీనియర్ సిటిజన్స్

వెంకోజీపాలెం : స్నేహితుల దినోత్సవాన్ని ఆబాలగోపాలం ఆదివారం సంతోషంగా జరుపుకున్నారు. కుల, మత, వయో భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా నిర్వహించుకునే ఒకే ఒక వేడుక స్నేహితుల దినోత్సవమని వీరంతా సందడి చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని కస్తూరి మహిళా మండలి సభ్యురాలు గ్రామ సేవా సంఘం కార్యాలయం వద్ద స్నేహితుల దినోత్సవాన్ని కేక్‌ను కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాత వెంకోజీపాలెంలో 50 ఏళ్ల పైబడి మహిళలంతా ఒక చోట కలిశారు. స్నేహ బంధానికి కుల, మత భేదాలు లేవని యువత నిరూపించింది.అందరూ ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లను కట్టుకుని స్నేహబంధాన్ని చాటుకున్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో...

ఎంవీపీ కాలనీ : ఆనాటి ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం అనుకుంటూ ఎంవీపీ కాలనీలోని వాకర్స్ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం అళ్వార్‌దాస్ మైదానంలో ఆనందంగా జరుపుకున్నారు. సీనియర్ సిటిజన్స్ అందరూ ఓ చోట చేరి, సభ్యులతో ఏర్పడిన స్నేహాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు. తమ జీవితంలో స్నేహ బంధాలను నెమరు వేసుకున్నారు. కేకు కట్‌చేసి పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని, రెండు గంటల పాటు అందరూ ఆనందంగా గడిపారు.

కరెంట్ చార్జీలు తగ్గించాలని పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు

ఆరిలోవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): "అదాని స్మార్ట్ మీటర్లు మాకొద్దు, పెంచిన ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆరిలోవ చివరి బస్‌స్టాపు నుంచి వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఇప్పటికే వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించి వారిపై భారాలు మోపింది. ఇప్పుడు గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బలవంతంగా పెట్టి వారిపై భారాలు మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని నినదించారు. ఐదేళ్ల క్రితం గృహవినియోగదారులు వినియోగించిన కరెంట్‌కు నష్టాలు వచ్చాయని చెప్పి ఇప్పుడు యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా రూ.12 వేల కోట్ల భారం వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పెంచిన ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కరెంట్ బిల్లు పెంచడం అన్యాయమన్నారు. అదానితో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దుచేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామంటూ ఐక్యవేదిక నాయకులు నినాదాలతో హోరెత్తించారు. ఆరిలోవ ప్రాంత ప్రజలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. స్మార్ట్ మీటర్ల రద్దు కోరుతూ ఈనెల 5న ఏపీఈపీడీసీఎల్ గురుద్వార కార్యాలయం వద్ద ఐక్యవేదిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో సీటు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు. ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేంద్ర కుమార్, సీపీఐ ఆరిలోవ ఏరియా కమిటీ నాయకులు లక్ష్మణరావు, కాసుబాబు. కుమారి, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- భార్య, భర్త విధులకు వెళ్లగా పట్టపగలు చొరబడిన దొంగలు
- ఎనిమిది తులాల బంగారు, ఐదు తులాల వెండి ఆభరణాలు అపహరణ
- వెంకటేశ్వర కాలనీలో ఘటన
- 20 రోజుల్లో ఇది రెండోసారి..



ఇంట్లో చిందర వందరగా పడేసిన వస్తువులు



అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో శనివారం పట్టపగలు ఓ అపార్టుమెంట్‌లో చోరీ జరిగింది. సుమారు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదును దొంగిలించుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలి. వెంకటేశ్వర కాలనీలో గల ఎస్ఎల్ ఈశ్వరి విహార్ అపార్టుమెంట్ మూడవ అంతస్థులో ఇక్కడి విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నీలిమ తన భర్త రాజుతో కలిసి నివాసం ఉంటున్నారు. రాజు స్థానికంగా ఉన్న ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తుంటారు. శనివారం ఉద యం ఈ భార్యభర్త ఇద్దరూ వారివారి విధులకు వెళ్లారు. సాయంత్రం నీలిమ ఇంటికి రాగా, తలుపు గడియ తొలగించి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా, సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో పాటు కప్‌బోర్డులో ఉంచిన సుమారు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి వస్తువులు, సుమారు ఆరు వేల రూపాయల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో ఆమె వెంటనే గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. క్రైమ్ విభాగం సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి విచ్చేసి పరిశీలించారు. క్లూస్ టీమ్ వివరాలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుంటే, వెంకటేశ్వర కాలనీ వరుస దొంగతనాలతో ప్రజలు హడలిపోతున్నారు. గత నెల 12న సుమారు కోటి రూపాయిల చోరీ జరిగింది. ఈ ఘటన జరిగి నెలరోజులు గడవక ముందే అదే వరుసలో ఉన్న మరో అపార్టుమెంట్‌లో పట్టపగలు దొంగతనం జరగడంతో భయాందోళన చెందుతున్నారు. ఇదే కాలనీలో ఎల్ఐసీ ఉద్యోగి చప్పా శ్రీనివాస్ తన కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న సుమారు కేజీన్నర బంగారు నగలు, 20 లక్షల నగదు, ఇతర వస్తువులను గత నెల 12న దొంగలు దోచుకెళ్లారు. ఇది జరిగి ఇరవై రోజులు గడవక ముందే చోరీ ఘటన చోటుచేసుకోవడంపై కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. వరుస చోరీలు పోలీసులకు తల బొప్పిగా మారాయి. ఒకవైపు ప్రతి అపార్టుమెంట్‌లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచిస్తున్నప్పటికీ అనేక మంది పాటించడం లేదని పోలీసులు చెపుతున్నారు. దీంతో దొంగలు కూడా సీసీ కెమెరాలు, వాచ్‌మెన్ లేని అపార్టుమెంట్లను టార్గెట్‌గా చేస్తున్నారని అంతున్నారు.



మాట్లాడుతున్న వెలగపూడి ప్రతాప్

బైక్ మెకానిక్‌ల సేవలు వెల కట్టలేనివి

ఆరిలోవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు స్కూటర్ అండ్ బైక్ మెకానిక్‌లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ అన్నారు. ఆయన ఆదివారం ముడసర్లోవ పార్కులో స్కూటర్ అండ్ బైక్ మెకానిక్ సంఘం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. వారు ఏర్పాటు చేసిన విడి భాగాల స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలని కోరారు. పూర్తిగా పాడైన వాహనానికి తిరిగి ప్రాణం పోసిన శక్తి మీకు ఉన్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంధకారంలో క్రాంతినగర్

ఆరిలోవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ టీఐసీ 12వ వార్డులో గల కొండవాలు ప్రాంతం ఐదు రోజులుగా వీధిలైట్లు వెలగక అంధకారంలో ఉందని స్థానికులు తెలిపారు. కొండవాలు ప్రాంతం కావడంతో అనేక రకాలు విషజంతువులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీధికుక్కలు వాహనాలకు అడ్డంగా రావడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

సందర్శకులతో జూపార్కు కిటకిట



నీటి ఏనుగు మోటు వద్ద సందర్శకులు

ఆరిలోవ, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సుమారు 2,720 మంది జూ పార్కును సందర్శించారు. వీరి నుంచి ప్రవేశ రుసుముగా సుమారు రూ.2.36 లక్షల ఆదాయం సమకూరిందని క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఉత్సాహంగా షటిల్ పోటీలు

వెంకోజీపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌బీకాలనీ అబ్దుల్ కలాం యూజర్స్ అండ్ రిక్రియేషన్ పార్కు షటిల్ బ్యాడ్మింటన్ ఆటగాళ్లు ఆదివారం పోటీలు నిర్వహించుకున్నారు. పార్కులో ఉన్న మూడు షటిల్ కోర్టుల సభ్యులు కలిసి విశాలాక్షినగర్‌లోని ఇండోర్ స్టేడియాన్ని వేదికగా చేసుకున్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాలుగా పోటీలను నిర్వహించుకోగా, సీనియర్ కేటగిరీ నుంచి నాగ సింహాద్రిరావు, పల్లా ప్రసన్నలు మొదటి బహుమతి పొందగా, రన్నర్స్‌గా మహేష్, వంశీలు గెలుపొందారు. అలాగే జూనియర్ కేటగిరీ నుంచి శంకర్, ఏఎన్ఆర్‌లు ప్రథమ బహుమతి పొందగా, రన్నర్స్‌గా ఒమ్మి కోటి, ఒమ్మి జగ్గారావులు గెలుపొందారు. వీరికి పెద్దలు పీల వెంకట పరదేశినాయుడు, శ్రీను, వెంకట్రావులు బహుమతులు అందజేశారు. రమేష్, సుధా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యోగా పోటీలు



యోగాసనాలు వేస్తున్న బాలబాలికలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాల ఆడిటోరియంలో ఆదివారం యోగా పోటీలు నిర్వహించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పది నుంచి 55 సంవత్సరాల వయసు గలవారికి పోటీలు ఏర్పాటుచేశారు. ట్రెడిషనల్ యోగాసన, ఫార్వర్డ్ బెండ్ ఇండివిడ్యువల్, బ్యాక్ బెండ్, ట్విస్టింగ్, లెగ్ బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, సుపైన్, ఆర్టిస్టిక్ యోగాసన సోలో, ఆర్టిస్టిక్ యోగాసన పెయిర్, రిథమిక్ పెయిర్ వంటి పది విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహరాజు, వైభవ్ మల్లిక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడపాల శంకరరావు, కార్యదర్శి ప్రభాకర్, రవిశంకర్, ప్రసాదరావు పర్యవేక్షించారు.

పాఠశాలల్లో ఇతరుల ప్రవేశం నిషేధ ఉత్తర్వులపై పునఃసమీక్షించాలి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల ప్రాంగణాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు పునఃసమీక్షించాలని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు కె. ప్రవీణ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇది బాలల హక్కుల పరిరక్షణ ఉల్లంఘనగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, ముందస్తు అనుమతి తీసుకున్న వ్యక్తులు, సంస్థలను మాత్రమే అనుమతిస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం, అలాగే రాజకీయ పార్టీల సంస్థలు, వ్యక్తులను నిరాకరించడం హర్షణీయమని, కానీ బాలల హక్కుల సంఘాలు, వారి సంక్షేమం కోసం,ఆరోగ్య పరిరక్షణ కోసం నిత్యం పలు కార్యక్రమాలు నిర్వహించే ప్రభుత్వేతర సేవా సంస్థలను కూడా అనుమతించబోరనే ఆలోచన ఉత్తర్వుల్లో కనిపిస్తోందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉత్తర్వులపై మరోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫిరాయింపు కార్పొరేటర్ల ఓటుహక్కు రద్దు చేయాలి : వైసీపీ



సమావేశంలో మాట్లాడుతున్నమ డిప్యూటీ మేయర్ సతీష్

మద్దిలపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీ నుంచి ఫిరాయించిన కార్పొరేటర్ల ఓటు హక్కు రద్దు చేయాలని డిప్యూటీ మేయర్ సతీష్, ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు పెండింగ్‌లో ఉండగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఫిరాయింపుదార్ల అనర్హత అంశం ప్రస్తుతం హైకోర్టులో ఉందని ఇప్పటికే వారికి జిల్లా కలెక్టర్ నోటీసులు కూడా పంపారని గుర్తు చేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పార్టీ మారిన వారికి ఓటుహక్కు కల్పించడం చట్ట విరుద్ధమన్నారు. ఫిరాయింపుదార్ల ఓట్ల ఆధారంగా జరిగిన ఎన్నిక చెల్లదన్నారు.

మనీలాను సందర్శించిన ఇండియన్ నేవీ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేవీ ఈస్టర్న్ ఫ్లీట్ షిప్స్ ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ శక్తి, ఐఎన్ఎస్ కిల్తాన్ ఆదివారం నాటికి ఫిలిప్పిన్స్‌లోని మనీలా తీరానికి చేరుకున్నాయి. సౌత్ ఈస్ట్ ఆసియా తీరంలో జరగనున్న ఆపరేషనల్ ఎక్సర్‌సైజుల్లో పాల్గొనేందుకు ఇవి అక్కడికి వెళ్లాయి. ఈస్టర్న్ ఫ్లీట్ కమాండింగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్ వీటికి నాయకత్వం వహిస్తున్నారు. ఫిలిప్పిన్స్ నేవీ అధికారులు, సిబ్బంది ఇండియన్ నేవీ నౌకలకు, సిబ్బందికి ఘనంగా స్వాగతం పలికారు. ఇరు దేశాల నేవీల బంధం బలపడేదిశగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇరు దేశాల నేవీ అధికారులు సమావేశమై ఆధునిక సాంకేతిక అమలుపై చర్చించుకున్నారు.



ఇండియన్ నేవీ అధికారికి స్వాగతం పలుకుతున్న ఫిలిప్పిన్స్ నేవీ సిబ్బంది

కరాటేతో ఆత్మరక్షణ : సినీ నటుడు సుమన్



కరాటే విద్యార్థికి ట్రోఫీ అందజేస్తున్న సుమన్

మల్కాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. యారాడ గ్రామంలో ఆంధ్ర షోటోఖాన్ కరాటే - దూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ పాల్గొని మాట్లాడారు. కరాటే సాధనతో సంపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కరాటే విద్య అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. యారాడ గ్రామంలో ఇటువంటి పోటీలు నిర్వహించడం ఇది తొలిసారి అని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, తెలుగుదేశం గ్రామ నాయకుడు తొత్తరి శ్రీనివాసరావు (చిట్టి), 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్లాప్ కార్మికుల 'స్మార్ట్ శానిటేషన్'!

» ప్లాస్టిక్‌ను సొమ్ము చేసుకుంటున్న వైనం » విధులను గాలికొదిలి స్క్రాప్ కొట్టు వద్ద జపం!
» ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ వట్టిదే » కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న పర్యవేక్షణ లోపం


ప్రతి చెత్త బండి మొదటగా పోయేది స్క్రాప్ కొట్టుకే....

మురళీనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): "ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్లాస్టిక్‌ను తరిమికొడదాం.. ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. తడి-పొడి చెత్తను వేరుచేసి ఆరోగ్య నగరంగా మార్చడానికి సహకరిద్దాం.. దీన్ని సామాజిక బాధ్యతగా భావిద్దాం.. అంటూ రోజూ సుప్రభాత సమయంలో క్లాప్ వాహనం నుంచి మైకులో హితోక్తులు వినిపిస్తాయి. ఆ శబ్ద తరంగాలకు నిద్రమత్తు వదిలించుకుంటూ నివాసితులు ఇళ్లలోని చెత్త డబ్బాలతో గబగబా క్లాప్ వాహనం వద్దకు చేరుకుంటారు. చేతికి గ్లౌజులు వేసుకుని సిద్ధంగా నిలబడే పారిశుధ్య కార్మికులు ఆ డబ్బాలు తీసుకుని తడి-పొడి చెత్తను వేరు చేసి క్లాప్ వాహనంలో వేర్వేరుగా ఉండే అరలలో వేస్తారనుకుంటే మీరు చెత్తలో చెయ్యేసినట్లే! వారి డేగ చూపులన్నీ ప్లాస్టిక్ సేకరణ కోసం.. ఎంత దొరికితే అంత లాభం అన్నట్టు..! స్క్రాప్ కొట్టువద్ద వేలాడే బోర్డు వారి కళ్ల ముందు కదలాడుతుంది.. ఐరన్ 27 రూపాయలు... ప్లాస్టిక్ రూ.16.. అట్ట పెట్టెలు రూ.12, ఐరన్ రేకులు రూ.20 (ఇవన్నీ కేజీల రేటు).. ఇంకేముంది? విధుల సంగతి దేవుడెరుగు? ముందు ప్రతి ఇంటి నుంచి వచ్చే వ్యర్థాల్లో మనకి పనికొచ్చేవేంటి? వాటిని క్లాప్ వాహనం వెనుక 'భద్రంగా' పెట్టిన పెద్ద పెద్ద సంచుల్లో జాగ్రత్త చేశామా.. స్క్రాప్ దుకాణానికి పోయి అమ్ముకున్నామా! అన్నదే ఆలోచన. క్లాప్ వాహనాల్లో వెళ్లే లోడర్లు, డ్రైవర్లు చేస్తున్న 'స్పెషల్ డ్యూటీ' ఇదే. ఆ తరువాతే, తడి-పొడి-విడి..విడి..ఏదైనా! ఒంటి చేత్తో సంచి భుజాన వేసుకొని తిరిగితే ఎంత దూరం పోగలరు..? అందుకే క్లాప్ కార్మికులకు వారి కోసం ప్రభుత్వ ధనం, ఇంధనంతో నడిచే వాహనాలనే అదనపు ఆదాయం కోసం వినియోగించుకుంటున్నారు. రోజూ వాటిని అమ్ముకుని వచ్చే అదనపు ఆదాయాన్ని (సైడ్ ఇన్‌కమ్) జేబులో వేసుకుంటున్నారు. వైసీపీ ఏలుబడిలో ప్రజలకు భారంగా మారిన చెత్త రుసుం రద్దయినా, కూటమి ప్రభుత్వ పాలనలోనూ చెత్త సేకరణ తీరు మారకపోవడం, పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

98 వార్డుల నుంచి తరలుతోంది కేవలం 1200 టన్నులే!

మధురవాడ బీచ్ రోడ్డులోని కాపులుప్పాడ డంపింగ్ కేంద్రానికి రోజూ వెళ్తుంది కేవలం 1200 టన్నుల చెత్త! మొత్తం విశాఖలోని 98 వార్డుల్లో 598 క్లాప్ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలకు అదనంగా మరో 440 పొక్లయిన్లు, డంపింగ్ లారీలు,


క్లాప్ వాహనం వెనుక వేలాడుతున్నవి వ్యక్తిగత చెత్త సేకరణ మూటలు

గార్బేజ్ ట్రక్‌లను నగర పరిశుభ్రత కోసం కేటాయించారు. మన స్మార్ట్ విశాఖను సుందరంగా ఉంచడానికి జీవీఎంసీలో అక్షరాలా అయిదు వేల మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి వార్డులో రమారమి 50 మంది పనిచేస్తున్నారు. అయినా నగరం నుంచి 1200 టన్నుల చెత్త మాత్రమే కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చేరగలుగుతోంది. సుమారు 23 లక్షల మంది నివసిస్తున్న విశాఖ నగర జనాభా నుంచి ఇంత తక్కువ పరిమాణంలో మాత్రమే చెత్తను సేకరించగలుగుతున్నారు. కార్మికులు వారి సొంత బేరం చూసుకుని, కాటా లెక్కలు, ఆదాయం చక్కబెట్టుకుని అన్‌లోడ్ పాయింట్‌కి చేరేసరికి కాలం హరించుకుపోతోంది. ఫలితంగా కార్మికుల సంఖ్య పెరిగినా, కొత్త సాంకేతిక విధానాలు, వాహనాలు అందుబాటులోకి వస్తున్నా చెత్త సేకరణ లక్ష్యం చేరడం లేదు. నగరం మురికి కూపంలానే ఉంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నగరాన్ని సుందరంగా ఉంచుతాం



నగరాన్ని సుందరంగా ఉంచడానికి శ్రమిస్తున్నాం. కార్మికులు విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటాం. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగుతూ నిరంతరం విధుల్లో ఉండేలా మార్గదర్శకాలు ఇస్తున్నాం. సంస్కరణలు అవసరమైన ప్రతి సందర్భంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా అమలు చేస్తున్నాం. వార్డు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శుల సాయంతో మహా విశాఖ నగరపాలక సంస్థను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రగతి దిశగా తీసుకెళ్లడానికి చర్యలు చేపడతాం. -ఈఎన్‌వీ నరేష్‌కుమార్, సీఎంవోహెచ్, జీవీఎంసీ

క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే చెడు వ్యసనాలకు దూరం


స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న అంగటి శ్రావణకుమార్ తదితరులు

మహారాణిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే ఆరోగ్య పరిరక్షణతో పాటు అందరి మధ్య ఐక్యత పెరిగి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని జనసేన 29వ వార్డు అధ్యక్షుడు అంగటి శ్రావణకుమార్ అన్నారు. ఆదివారం మహారాణిపేట జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా మొక్కలు నాటి అనంతరం ఫ్రెండ్స్ ప్రీమియర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రావణకుమార్ మాట్లాడుతూ ఫ్రెండ్స్ ప్రీమియర్ లీగ్‌లో 8 జట్లుగా 104 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ, మహేష్, ఈశ్వర్, కిషోర్, రాకేష్, త్రినాథ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

'సభాపతి గౌరవానికి భంగం కలిగించలేదు'

సీతంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):శాసన సభాపతి అయ్యన్న పాత్రుడుకి క్షమాపణ చెబుతున్నానని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఎప్పుడూ మాట్లడలేదని పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయ్యన్నకు అన్యాయం చేసిన వైసీపీ వ్యక్తులకే కూటమి ప్రభుత్వంలో అప్పనంగా మాజీ సైనిక ఉద్యోగి భూమికి ఎన్‌ఓసీ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశానన్నారు. రాయలసీమ వ్యక్తికి మాజీ సైనికోద్యోగిగా విశాఖలో భూమి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అయ్యన్న తమ్ముడి కుమారుడు, వైసీపీ సానుభూతిపరుడు వరుణ్ ఈ వ్యవహారం నడిపారని, కూటమి ప్రభుత్వంలో రూ.100 కోట్ల విలువైన భూములు ఫ్రాబ్రికెట్ చేసి కొట్టేశారన్నారు. సన్యాసిపాత్రుడికి మేలు చేసేలా అధికారులు సహకరించారన్నారు. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని మూర్తియాదవ్ డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మూర్తియాదవ్

అనాథ మృతదేహానికి స్వచ్ఛంద ప్రతినిధుల అంత్యక్రియలు


శ్మశాన వాటికకు మృతదేహం తరలింపు

జ్ఞానాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం మదర్‌థెరిస్సా ఆశ్రమం సమీపంలో రోడ్డుపై గుర్తుతెలియని అనాథ మరణించడంతో అవర్‌హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం అంత్యక్రియలు జరిపించారు. సంస్థ సభ్యులు పిల్లి గోవిందరాజు, శ్యామ్‌సుందర్ రెడ్డి, సానబాని ఫ్రాన్సిస్‌లు స్థానిక 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మధుబాబు, రవిబాబుల ఆర్థిక సహకారంతో అంబులెన్స్ తెప్పించారు. మృతదేహానికి కాన్వెంట్ శ్మశానవాటికలో ఇన్‌చార్జ్ ప్రసన్నకుమార్ సహకారంతో అంత్యక్రియలు జరిపించారు.

వెటరన్ క్రీడాకారులకు నగర పోలీస్ కమిషనర్ అభినందన

మురళీనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో పతకాలు సాధించిన నగర క్రీడాకారులను విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేకంగా అభినందించారు. మురళీనగర్ వనితా వాకర్స్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మలేసియా, శ్రీలంక దేశాల్లో ఇటీవల జరిగిన చాంపియన్‌షిప్‌లో స్వర్ణ, కాంస్య, రజత పతకాలు అందుకున్న అథ్లెట్స్ ఎం.రామారావు, కేబీవీఎం.కృష్ణప్రసాద్, కె.పూర్ణిమ, కె.మత్స్యకొండలకు ప్రశంసాపత్రాల్ని, జ్ఞాపికలను సీపీ అందజేశారు. వారి క్రీడాస్ఫూర్తికి శుభాభినందనలు తెలిపారు. వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం (వావ్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పతక సాధకులు, అతిథులు, నిర్వాహకులు బృందచిత్రం దిగి సంతోషం పంచుకున్నారు. అసోసియేషన్ చీఫ్ పేట్రన్ కమల్ బయిద్, వావ్ ప్రెసిడెంట్ మంగప్రసాద్, కో-ఆర్డినేటర్ సి.హెచ్.శ్రీనివాసరాజు, వైశాఖీ స్పోర్ట్స్ పార్కు కార్యదర్శి పి.ఎస్.ఎన్.రాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, వనితా వాకర్స్ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరి విజయం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.



నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో వెటరన్ క్రీడాకారులు, వావ్ క్లబ్ ప్రతినిధులు

నృత్య కళలను ప్రోత్సహించాలి

» ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్

సీతమ్మధార, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయంలో భాగమైన సంప్రదాయ నృత్య కళలను, కళాకారులను తప్పనిసరిగా ప్రోత్సహించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పేర్కొన్నారు. మధురానగర్, శంకరమఠం ఎదురుగా గల పద్మశాలి భవన్‌లో నటరాజ నృత్య నికేతన్ వ్యవస్థాపకులు, నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ ఆధ్వర్యంలో విద్యార్థినుల గజ్జ పూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ నృత్య కళాకారులతోనే సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. కళాకారుల కోసం నాట్య గురువు నటరాజ పరమేశ్వరన్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, కె.సత్యనారాయణ, బీవీఎస్ కల్యాణి, వి.కృష్ణమోహన్, భక్త మార్కండేయ, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


నృత్య కళాకారులతో అతిథులు

ఘనంగా స్నేహితుల దినోత్సవం


ఆత్మీయ సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

అల్లిపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అల్లిపురంలోని రైల్వే వైర్లెస్‌కాలనీ ఉన్నత పాఠశాలలో 1987-88లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కలుసుకున్నారు. వారి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో కలిసి పంచుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది విచ్చేశారు. తమకు చదువులు నేర్పించిన అప్పటి ఉపాధ్యాయులను గుర్తుచేసుకొని మృతిచెందిన వారికి నివాళుల ర్పించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. ఆపదలో ఉండే తమ స్నేహితులకు ఆర్థికసహాయం అందించేవిధంగా ప్రణాళికలు వేసుకున్నారు.

కాలనీల్లో ఇష్టారాజ్యంగా కేబుల్స్ ఏర్పాటు

» తెగిపడిన వైర్లతో ఆందోళన
» విద్యుత్ వైర్లో, కేబుల్స్ వైర్లో తెలియక భయం



ఎఫ్‌సీఐ కాలనీ రహదారిలో తలకు తగిలేలా వేలాడుతున్న బాక్స్‌తో కూడిన కేబుల్

మర్రిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 53వ వార్డు పరిధిలోని కాలనీల్లో పలు ఇంటర్‌నెట్ సంస్థల సిబ్బంది తమ కేబుల్స్‌ను ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేస్తుండటం పట్ల ఆయా కాలనీలవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో విద్యుత్ సరఫరా అయ్యే స్తంభాలకు పెద్దఎత్తున కేబుల్ వైర్లతోపాటు వాటికి సంబంధించిన బాక్స్‌లను కూడా అమర్చడంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల వద్ద పిచ్చుకగూళ్లను తలపిస్తుంటే, మరోపక్క ప్రధాన రహదారులు పందిర్ల మాదిరిగా కనిపిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలపై కేబుల్‌వైర్లను భారీసైజ్‌లో చుట్టేసి ఆయా బండిల్స్ స్తంభాలకు కట్టేస్తున్నారు. దీనితో స్తంభాల నుంచి విద్యుత్ సరఫరా పొందుతున్నవారు ఎప్పుడైన వారికి సరఫరాలో ఆటంకం కలిగినప్పుడు మరమ్మతులు చేసుకోవాలంటే ఏది విద్యుత్ ప్రవహించే వైరో, ఏది కేబుల్ వైరో తెలియక తికమకపడుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం బారిన పడతామోనని భయపడుతున్నారు. మరికొన్ని చోట్ల స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు తెగి రోడ్లపై చెల్లాచెదురుగా పడి ఉండటంతో ఆయా రహదారుల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయపడుతున్నారని పలువురు చెబుతున్నారు. కేబుల్స్ పెద్దఎత్తున ఏర్పాటు చేయడంతో వర్షాలు పడే సందర్భంలో గాలులు వీచినప్పుడు ఆయా వైర్ల రాపిడికి అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటూ ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పలు సంస్థలు ఇష్టారాజ్యంగా కేబుల్, ఇంటర్‌నెట్‌కు సంబంధించిన కేబుల్స్‌ను విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బందులు పడేలా వ్యవహరిస్తున్నాయని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సాయినగర్ ప్రధాన రహదారిలో పందిరిని తలపిస్తున్న కేబుల్ వైర్లు

అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలి: హేమంత్‌కుమార్

డాబాగార్డెన్స్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ తక్షణమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేశ్‌లకు క్షమాపణ చెప్పాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఐటీ మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ ఎన్ని కంపెనీలు, ఉద్యోగాలు తెచ్చారో చెప్పాలన్నారు. ఇదే విషయమై బహిరంగ చర్చకు గాజువాక సెంటర్‌లో ఈ నెల 5లోగా వచ్చి నిరూపించాలని సవాల్ విసిరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కారకులు జగన్, విజయసాయిరెడ్డిలే అన్నారు. అమర్‌నాథ్ విశాఖ ప్రజల దృష్టిలో ఇంకా పాఠశాల విద్యార్థితో సమానమన్నారు. ఆయనకు ఐటీ మంత్రిగా అవకాశం ఇస్తే కనీసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతించాల్సిన ఐటీఐ ఇనిస్టిట్యూట్ కూడా తేలేకపోయిన అసమర్థుడు అన్నారు. మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలు గత వైసీపీ సర్కార్ గాలికి వదిలిపెడితే నిరుద్యోగులపై అభిమానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు వాటి ప్రక్రియను ఇటీవల పూర్తి చేసిన సంగతి అమర్‌నాథ్‌కు తెలియలేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో జి.గోవిందు, వాసుపల్లి రాంబాబు, శివ, అభిరామ్, గౌరీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్, ఇతర ప్రతినిధులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణలు చేశారు. భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు సిరి సంపెంగలతో పూజలు జరి పారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. అంతకముందు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి నారసింహ అష్టోత్తర శతనామావళితో అర్చన జరిపారు. భక్తులు గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.



హద్దు మీరితే కఠిన చర్యలు: సీఐ

సీతంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రవర్తనతో నడుచుకుని సమాజంలో ముందుకు సాగాలని, హద్దు మీరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని సీఐలు ఎ.సత్యనారాయణ, రమణలు రౌడీషీటర్లను హెచ్చరించారు. నాలుగో పట్టణం, ద్వారకా పోలీసు స్టేషన్ల పరిధిలో గల రౌడీషీటర్లకు పోలీసు స్టేషన్ల ఆవరణలో ఆదివారం కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు వారికి పలు అంశాల్లో హెచ్చరికలు చేశారు. సత్ప్రవర్తనతో మెలగుతూ, పోలీసులకు తమ కదలికలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. ఎవరైనా బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు సంబంధిత పోలీసు స్టేషన్‌లో లేదా వారిని పర్యవేక్షిస్తున్న పోలీసులకు తెలియజేయాలన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్యనారాయణ

ఆ దారిలో నడవాలంటేనే దడ!

» రోడ్డుకిరువైపులా వాహనాలతో ఆక్రమణ
» పట్టించుకోని జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారులు

డాబాగార్డెన్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ ప్రాంతమంటే తెలియనివారుండరు. అటువంటి ప్రాంతానికి నిత్యం అనేక పనులపై ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో డాబాగార్డెన్స్ సెంటర్ పాయింట్ జంక్షన్ నుంచి మొదటి మలుపుగా తిరిగే సమయంలో భానుస్ట్రీట్ మొదలయ్యే దారిలో పాదచారులు నడవాలంటేనే గగనమైపోతుంది. ఇక్కడనున్న ఫుడ్‌పాయింట్ సెంటర్స్ ఇతరత్రా దుకాణాలు, వాణిజ్య సముదాయాలకు వచ్చే వారికి ఎంచక్కా రోడ్డే పార్కింగ్ అయిపోయింది. ఇటీవల కాలంలో ఈ సమస్య మరింత జటిలంగా మారిపోయింది. ఇష్టానుసారంగా వాహనదారులు రోడ్డుపైనే తినుబండారాలు ఆరగిస్తూ రాకపోకలు సాగించే వారికి అసౌకర్యం కలిగేలా చేస్తున్నారని, దీంతో ఎటు నుంచి నడవాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడుతుందని పలువురు పాదచారులు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు, చిన్నపాటి పెద్ద వాహనాలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ జామ్ తిప్పలు తప్పవంటూ వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-4 కార్యాలయానికి, టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే ఇవీ ఉన్నప్పటికీ వీటిని చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. అసలు రోడ్డుపైన పదుల సంఖ్యలో రెండువైపులా పార్కింగ్ చేస్తున్నా వీరికి పట్టనట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బాటసారులు సులభంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు పాదచారులు, వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నిరంతర పర్యవేక్షణ

... 5వ పేజీ తరువాయి

నిరంతరం పర్యవేక్షించేలా ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజూ ఐదు కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల్లో జరిగిన ప్రతి కేసుకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. సృష్టి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు ఆధ్వర్యంలో 11 ఫెర్టిలిటీ సెంటర్లు, సరోగసీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మిగిలిన వాటిని అధికారులు తనిఖీ చేయనున్నారు.

రెండో దశలో ఆస్పత్రుల తనిఖీ

మొదటి దశలో సరోగసీ, ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు నిర్వహించేలా నిర్దేశించారు. రెండో దశలో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, డెంటల్ హాస్పిటల్స్‌లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డెంటల్ క్లినిక్స్ 252 ఉన్నాయి. వీటిని నిరంతరం పర్యవేక్షించేలా సదరు అధికారులకు ఆదేశాలు అందాయి. ఫెర్టిలిటీ సెంటర్లు, సరగోసీ కేంద్రాలకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నట్టు సమాచారం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు ఆయా కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఏదైనా సమస్య వెలుగులోకి వచ్చిన తరువాత అధికారులు హడావిడి చేయడం, తరువాత పక్కన పెట్టేయడం పరిపాటిగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ ఫోన్లు మాకొద్దు!

... 5వ పేజీ తరువాయి

రద్దుచేయాలని, కేంద్రాల నిర్వహణకు 5జీ నెట్‌వర్క్‌తో కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని కోరుతున్నారు. వేతనాలు పెంచాలని, మినీల్లో పనిచేసేవారిని మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీవో విడుదల చేయాలని, గ్రాట్యూటీ జీవోలో మార్పులుచేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు గైడ్‌లైన్స్ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం అధికారులకు వినతిపత్రాలు అందించాలని నిర్ణయించారు.

ఇంటర్‌లో పెరిగిన ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

రెండుమూడు చోట్ల ప్రవేశాలు పెరిగాయి. గాజువాకలో ఎంపీసీ 26, బైపీసీ 42 మొత్తం 68 మంది, గోపాలపట్నంలో ఎంపీసీ, బైపీసీలో 95 మంది చేరారు. రాంపురంలో ఏంపీసీలో ఒకరు, బైపీసీలో ముగ్గురు మాత్రమే చేరారు. గంగవరంలో ఎంపీసీలో కేవలం ఐదుగురు ఉండగా, బైపీసీలో 18మంది చేరారు. మల్కాపురంలో ప్రథమ ఏడాది ప్రవేశాలు లేవు. ఇక్కడ ద్వితీయ ఏడాదిలో 22 మంది అదే ప్రాంగణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులకు హాజరవుతున్నారు. సీతమ్మధార ఎన్ఎంసీ పాఠశాలలో రెండు గ్రూపులకు ప్రథమ ఏడాదిలో 20మంది చేరారు. ఇక్కడ ఏడుగురు పీజీటీలుండగా నలుగురికి హెచ్ఎంలుగా పదోన్నతి రావడంతో ఉన్న ముగ్గురే పాఠాలు బోధిస్తున్నారు.

మెకానికల్‌లో అడ్వైజర్ గోల

... 5వ పేజీ తరువాయి

చెప్పేందుకు సాహసించలేకపోతున్నారు. అంతేకాకుండా ఈ విభాగంలోని వాహనాల మరమ్మతులకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కమిషనర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులకు తెలిసేలా ఒక ప్రైవేటు ఏజెన్సీ రూపొందించిన యాప్‌కు బిల్లు చెల్లించాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. ఇటీవల మెకానికల్ విభాగంపై కమిషనర్ సమీక్ష నిర్వహించినపుడు ఈ యాప్‌పై సూచించినట్టు చెబుతున్నారు. గతంలో 'ఇంట్రోల్యాబ్స్' అనే సంస్థ అభివృద్ధిచేసిన యాప్‌ను వాహన రిపేర్లను ట్రాకింగ్ చేయడానికి వినియోగించేవారు. అందుకోసం ఏజెన్సీకి జీవీఎంసీ నుంచి నెలకు రూ.70 వేలు చెల్లించేవారు. గత ఆరు నెలలుగా ఆ యాప్ పనిచేయడంలేదు. తాజాగా అదే యాప్ సేవలను వినియోగించుకుంటే పనిచేయని ఆరునెలలకు బిల్లు పెట్టించి కొట్టేయవచ్చని కమిషనర్ వద్ద ప్రస్తావించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెకానికల్ విభాగంలో అనుభవం, నైపుణ్యం ఉన్న ఇంజనీర్లుండగా, ప్రైవేటు వ్యక్తికి నియమించాల్సిన అవసరమేమిటని ఆ విభాగం అధికారులు ప్రశ్నిస్తున్నారు.

మహా దోపిడీ

... 5వ పేజీ తరువాయి

సమాయత్తమవుతున్న సమయంలో బదిలీ అయిపోయింది.

అక్రమాలపై ఆరోపణలు

ఫాగింగ్‌లో అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలుండగా, నిధులు చాలడం లేదని అదనంగా కేటాయించాలని మలేరియా విభాగం అధికారులు జీవీఎంసీ ఉన్నతాధికారులకు విన్నవించినట్టు తెలిసింది. ఫాగింగ్‌కు నెలకు రూ.58.79 లక్షలు కేటాయిస్తుండగా, మూడు నెలలుగా అదనంగా రూ.24.69 లక్షలు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. ఫాగింగ్ పేరుతో కొంతమంది అధికారులు, సిబ్బంది నిధులను నొక్కేస్తున్నారని కొందరు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఇందులో కొందరు కార్పొరేటర్లకు, అధికారులకు వాటాలు అందుతుండడంతో అక్రమాలకు అండగా నిలుస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరాధార ఆరోపణలు

ఫాగింగ్ పేరుతో జరుగుతున్న అక్రమాలపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా అక్రమాలు జరగడానికి అవకాశమే లేదని కొట్టిపారేశారు. గిట్టనివారే ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. మలేరియా విభాగంలో ప్రస్తుతం ఆరు మెగా ఫాగింగ్ యంత్రాలతోనే ఫాగింగ్ జరుగుతోందన్నారు. గంటకు వందలీటర్లు డీజిల్ ఖర్చవుతోందని గత కమిషనర్ విచారణలో కూడా తేలిందని చెప్పడం కొసమెరుపు.

యూసీడీలో దోపిడీపై ఆరా!

... 5వ పేజీ తరువాయి

ఫీజుగా రూ.300కు బదులు యూసీడీ సిబ్బంది రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని మహిళా సంఘాల సభ్యులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల ఒకటిన 'యూసీడీ దోపిడీ' శీర్షికన కథనం ప్రచురితమయింది. దీనిపై స్పందించిన మెప్మా ఎండీ, జీవీఎంసీ కమిషనర్ వేర్వేరుగా యూసీడీ పీడీకి ఫోన్‌చేసి ఆరా తీసినట్టు తెలిసింది. విచారణ జరిపి బాధ్యులను గుర్తించి నివేదిక పంపాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు యూసీడీ పీడీ సత్యవేణి జోన్‌లవారీగా విచారణ జరిపారు. కొన్నిచోట్ల అదనంగా రూ.200 వసూలుచేసినట్టు తేలిందని కొంతమంది యూసీడీ సిబ్బంది చెబుతున్నారు.



కాలువలో మృతదేహం

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఇసుకతోట పెట్రోలు బంకు సమీపంలోని డ్రైనేజీలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న ఎంవీపీ పోలీసులు వివరాలు ఆరా తీశారు. అతడ్ని శివాజీపాలెం సాయిబాబా ఆలయం ప్రాంతీయుడు ఉల్లి పోలిరాజు(38)గా గుర్తించారు. శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన పోలిరాజు రాత్రి తొమ్మిది గంటలప్పుడు తనతో ఫోన్ మాట్లాడుతూ ఒక్కసారిగా అరిచాడని, తర్వాత ఫోన్ కట్ అయ్యిందని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తర్వాత వివిధ చోట్ల అతడి కోసం వెతికామని, ఆచూకీ తెలియలేదని పేర్కొంది. ఆదివారం తెల్లవారు జామున రెండున్నర గంటల సమయంలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నారు.

తల్లిదండ్రులకు బాలికల అప్పగింత

పాయకరావుపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో చెప్పకుండా ఆదివారం దువ్వాడలో రైలు ఎక్కిన ఇద్దరు బాలికలను తునిలో ప్రభుత్వ రైల్వే పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి తుని రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నంలోని అగనంపూడికి చెందిన ఇద్దరు బాలికలు ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లిపోయారని సమాచారం అందడంతో తుని రైల్వే స్టేషన్ సిబ్బంది ఎన్. నానిబాబు, మోహనరావు రైళ్లలో తనిఖీ చేయడం ప్రారంభించారు. అలానే బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు బాలికలను కనుగొని వారిని రైలు నుంచి దించారు. స్టేషన్‌కు తీసుకువచ్చి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా రైలు ఎక్కాలని నిర్ణయించుకుని దువ్వాడ స్టేషన్‌లో రైలు ఎక్కామన్నారు. దీంతో వారి తల్లిదండ్రులను తుని రైల్వే పోలీస్ స్టేషన్‌కి పిలిపించి, ఇద్దరు బాలికలను అప్పగించినట్టు ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఈనెలలో 147 మంది పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెలలో 147మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్నారు. సాధారణంగా ప్లాంట్‌లో జూన్, జూలై నెలల్లో పదవీ విరమణలు ఎక్కువగా ఉం టాయి. కానీ ఈ ఏడాది రికార్డు స్థాయిలో జూన్ నెలలో 238 మంది, జూలైలో 121 మంది ఉద్యోగులు రిటైరయ్యారు. మళ్లీ ఈ నెల మరో 147మంది పదవీ విర మణ చేయనున్నారు. ఒకేసారి ఇంత మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో పాటు రానున్న రోజుల్లో రెండో వీఆర్ఎస్ ద్వారా మరికొంత మంది ఉద్యోగులు ఉద్యోగాలను వీడనున్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 50,బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 42, దేముడు చిక్కుడు 102, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186



ఆర్‌కే బీచ్‌లో విద్యార్థినుల సందడి



కేక్ కట్‌చేస్తున్న కస్తూరి మహిళా మండలి సభ్యురాలు

సాగర తీరంలో స్నేహ వీచిక

బీచ్ రోడ్డు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అందమైన సాగరతీరం ... ఎదురుగా పలకరిస్తూ వెళ్లిపోయే కెరటాలు... చల్లచల్లని గాలి... స్నేహితులు కబుర్లు చెప్పుకోవడానికి ఇంతకు మించిన స్థలం ఏముంటుంది? యువతను చూడండి.. ఆనందాన్ని దోసిళ్లతో తామే ఒడిసి పట్టుకున్నట్లుగా ఎంత చక్కగా తుళ్లింతలతో కనిపిస్తున్నారో... ఆదివారం స్నేహితుల పండుగ కదా! యువత ఆటపాటల్లో మునిగిపోయారు. కొందరు గుంపులుగా తరలివచ్చి సెల్ఫీలతో సందడి చేశారు. సముద్రంలో తడుస్తూనే యువత కేరింతలు కొట్టారు. సెలవు రోజు కావడంతో ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు ఆర్కే బీచ్‌లో సందడి చేశారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలిరా



తీరంలో మహిళల ఆనందం

వడంతో బీచ్ ప్రాంతం కోలాహలంగా మారింది. సముద్రంలో స్నానం చేయడానికి ఎక్కువమంది ఆసక్తి చూపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గజ ఈతగాళ్లు, పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. వాహనాలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



స్నేహితుల దినోత్సవం జరుపుకుంటున్న సీనియర్ సిటిజన్స్

వెంకోజీపాలెం : స్నేహితుల దినోత్సవాన్ని ఆబాలగోపాలం ఆదివారం సంతోషంగా జరుపుకున్నారు. కుల, మత, వయో భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా నిర్వహించుకునే ఒకే ఒక వేడుక స్నేహితుల దినోత్సవమని వీరంతా సందడి చేశారు. కొత్త వెంకోజీపాలెంలోని కస్తూరి మహిళా మండలి సభ్యురాలు గ్రామ సేవా సంఘం కార్యాలయం వద్ద స్నేహితుల దినోత్సవాన్ని కేక్‌ను కట్ చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాత వెంకోజీపాలెంలో 50 ఏళ్ల పైబడి మహిళలంతా ఒక చోట కలిశారు. స్నేహ బంధానికి కుల, మత భేదాలు లేవని యువత నిరూపించింది.అందరూ ఫ్రెండ్ షిప్ బ్యాండ్‌లను కట్టుకుని స్నేహబంధాన్ని చాటుకున్నారు.

వాకర్స్ ఆధ్వర్యంలో...

ఎంవీపీ కాలనీ : ఆనాటి ఆ జ్ఞాపకాలన్నీ మధురాతి మధురం అనుకుంటూ ఎంవీపీ కాలనీలోని వాకర్స్ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఆళ్వార్‌దాస్ మైదానంలో ఆనందంగా జరుపుకున్నారు. సీనియర్ సిటిజన్స్ అందరూ ఓ చోట చేరి, సభ్యులతో ఏర్పడిన స్నేహాన్ని మరోసారి గుర్తు చేసుకున్నారు. తమ జీవితంలో స్నేహ బంధాలను నెమరు వేసుకున్నారు. కేకు కట్‌చేసి పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని, రెండు గంటల పాటు అందరూ ఆనందంగా గడిపారు.



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఉత్సాహంగా షటిల్ పోటీలు

వెంకోజీపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌బీకాలనీ అబ్దుల్ కలాం యూజర్స్ అండ్ రిక్రియేషన్ పార్కు షటిల్ బ్యాడ్మింటన్ ఆటగాళ్లు ఆదివారం పోటీలు నిర్వహించుకున్నారు. పార్కులో ఉన్న మూడు షటిల్ కోర్టుల సభ్యులు కలిసి విశాలాక్షినగర్‌లోని ఇండోర్ స్టేడియాన్ని వేదికగా చేసుకున్నారు. సీనియర్స్, జూనియర్స్ విభాగాలుగా పోటీలను నిర్వహించుకోగా, సీనియర్ కేటగిరీ నుంచి నాగ సింహాద్రిరావు, పల్లా ప్రసన్నలు మొదటి బహుమతి పొందగా, రన్నర్స్‌గా మహేష్, వంశీలు గెలుపొందారు. అలాగే జూనియర్ కేటగిరీ నుంచి శంకర్, ఏఎన్ఆర్‌లు ప్రథమ బహుమతి పొందగా, రన్నర్స్‌గా ఒమ్మి కోటి, ఒమ్మి జగ్గారావులు గెలుపొందారు. వీరికి పెద్దలు పీల వెంకట పరదేశినాయుడు, శ్రీను, వెంకటర్రావులు బహుమతులు అందజేశారు. రమేష్, సుధా తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న యోగా పోటీలు



యోగాసనాలు వేస్తున్న బాలబాలికలు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీలోని ఐఐఎం కళాశాల ఆడిటోరియంలో ఆదివారం యోగా పోటీలు నిర్వహించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పది నుంచి 55 సంవత్సరాల వయసు గలవారికి పోటీలు ఏర్పాటుచేశారు. ట్రెడిషనల్ యోగాసన, ఫార్వర్డ్ బెండ్ ఇండివిడ్యువల్, బ్యాక్ బెండ్, ట్విస్టింగ్, లెగ్ బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, సుపైన్, ఆర్టిస్టిక్ యోగాసన సోలో, ఆర్టిస్టిక్ యోగాసన పెయిర్, రిథమిక్ పెయిర్ వంటి పది విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నరసింహరాజు, వైభవ్ మల్లిక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడపాల శంకరరావు, కార్యదర్శి ప్రభాకర్, రవిశంకర్, ప్రసాదరావు పర్యవేక్షించారు.

పాఠశాలల్లో ఇతరుల ప్రవేశం నిషేధ ఉత్తర్వులపై పునఃసమీక్షించాలి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల ప్రాంగణాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు పునఃసమీక్షించాలని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు కె. ప్రవీణ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇది బాలల హక్కుల పరిరక్షణ ఉల్లంఘనగా భావించాల్సి వస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, ముందస్తు అనుమతి తీసుకున్న వ్యక్తులు, సంస్థలను మాత్రమే అనుమతిస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయం, అలాగే రాజకీయ పార్టీల సంస్థలు, వ్యక్తులను నిరాకరించడం హర్షణీయమని, కానీ బాలల హక్కుల సంఘాలు, వారి సంక్షేమం కోసం,ఆరోగ్య పరిరక్షణ కోసం నిత్యం పలు కార్యక్రమాలు నిర్వహించే ప్రభుత్వేతర సేవా సంస్థలను కూడా అనుమతించబోరనే ఆలోచన ఉత్తర్వుల్లో కనిపిస్తోందని, దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఉత్తర్వులపై మరోసారి సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఫిరాయింపు కార్పొరేటర్ల ఓటుహక్కు రద్దు చేయాలి : వైసీపీ



సమావేశంలో మాట్లాడుతున్నమ డిప్యూటీ మేయర్ సతీష్

మద్దిలపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైసీపీ నుంచి ఫిరాయించిన కార్పొరేటర్ల ఓటు హక్కు రద్దు చేయాలని డిప్యూటీ మేయర్ సతీష్, ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లపై అనర్హత వేటు పెండింగ్‌లో ఉండగా స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఫిరాయింపుదార్ల అనర్హత అంశం ప్రస్తుతం హైకోర్టులో ఉందని ఇప్పటికే వారికి జిల్లా కలెక్టర్ నోటీసులు కూడా పంపారని గుర్తు చేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో పార్టీ మారిన వారికి ఓటుహక్కు కల్పించడం చట్ట విరుద్ధమన్నారు. ఫిరాయింపుదార్ల ఓట్ల ఆధారంగా జరిగిన ఎన్నిక చెల్లదన్నారు.

కరెంట్ చార్జీలు తగ్గించాలని పాదయాత్ర



పాదయాత్రలో పాల్గొన్న వామపక్షాల నాయకులు, కార్యకర్తలు

ఆరిలోవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): "ఆదాని స్మార్ట్ మీటర్లు మాకొద్దు, పెంచిన ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆరిలోవ చివరి బస్‌స్టాపు నుంచి వామపక్ష ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర చేపట్టారు. ఇప్పటికే వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు బిగించి వారిపై భారాలు మోపింది. ఇప్పుడు గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బలవంతంగా పెట్టి వారిపై భారాలు మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని నినదించారు. ఐదేళ్ల క్రితం గృహవినియోగదారులు వినియోగించిన కరెంట్‌కు నష్టాలు వచ్చాయని చెప్పి ఇప్పుడు యూనిట్‌కు 40 పైసల చొప్పున అదనంగా రూ.12 వేల కోట్ల భారం వేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పెంచిన ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కరెంట్ బిల్లు పెంచడం అన్యాయమన్నారు. ఆదానితో చేసుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందం రద్దుచేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామంటూ ఐక్యవేదిక నాయకులు నినాదాలతో హోరెత్తించారు. ఆరిలోవ ప్రాంత ప్రజలు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. స్మార్ట్ మీటర్ల రద్దు కోరుతూ ఈనెల 5న ఏపీఈపీడీసీఎల్ గురుద్వార కార్యాలయం వద్ద ఐక్యవేదిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో సిటు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు. ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేంద్ర కుమార్, సీపీఐ ఆరిలోవ ఏరియా కమిటీ నాయకులు లక్ష్మణరావు, కాసుబాబు. కుమారి, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలగపూడి ప్రతాప్

బైక్ మెకానిక్‌ల సేవలు వెల కట్టలేనివి

ఆరిలోవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వాహనదారులకు స్కూటర్ అండ్ బైక్ మెకానిక్‌లు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు వెలగపూడి ప్రతాప్ అన్నారు. ఆయన ఆదివారం ముడసర్లోవ పార్కులో స్కూటర్ అండ్ బైక్ మెకానిక్ సంఘం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. వారు ఏర్పాటు చేసిన విడి భాగాల స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలని కోరారు. పూర్తిగా పాడైన వాహనానికి తిరిగి ప్రాణం పోసిన శక్తి మీకు ఉన్నదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అంధకారంలో క్రాంతినగర్

ఆరిలోవ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ టీఐసీ 12వ వార్డులో గల కొండవాలు ప్రాంతం ఐదు రోజులుగా వీధిలైట్లు వెలగక అంధకారంలో ఉందని స్థానికులు తెలిపారు. కొండవాలు ప్రాంతం కావడంతో అనేక రకాలు విషజంతువులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వీధికుక్కలు వాహనాలకు అడ్డంగా రావడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

సందర్శకులతో జూపార్కు కిటకిట



నీటి ఏనుగు మోటు వద్ద సందర్శకులు

ఆరిలోవ, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సుమారు 2,720 మంది జూ పార్కును సందర్శించారు. వీరి నుంచి ప్రవేశ రుసుముగా సుమారు రూ.2.36 లక్షల ఆదాయం సమకూరిందని క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

- భార్య, భర్త విధులకు వెళ్లగా పట్టపగలు చొరబడిన దొంగలు
- ఎనిమిది తులాల బంగారు, ఐదు తులాల వెండి ఆభరణాలు అపహరణ
- వెంకటేశ్వర కాలనీలో ఘటన ▸▸ 20 రోజుల్లో ఇది రెండోసారి..





ఇంట్లో చిందర వందరగా పడేసిన వస్తువులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో శనివారం పట్టపగలు ఓ అపార్టుమెంట్‌లో చోరీ జరిగింది. సుమారు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదును దొంగిలించుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలి. వెంకటేశ్వర కాలనీలో గల ఎస్ఎల్ ఈశ్వరి విహార్ అపార్టుమెంట్ మూడవ అంతస్థులో ఇక్కడి విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నీలిమ తన భర్త రాజుతో కలిసి నివాసం ఉంటున్నారు. రాజు స్థానికంగా ఉన్న ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తుంటారు. శనివారం ఉద యం ఈ భార్యభర్త ఇద్దరూ వారివారి విధులకు వెళ్లారు. సాయంత్రం నీలిమ ఇంటికి రాగా, తలుపు గడియ తొలగించి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా, సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో పాటు కప్‌బోర్డులో ఉంచిన సుమారు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి వస్తువులు, సుమారు ఆరు వేల రూపాయల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో ఆమె వెంటనే గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. క్రైమ్ విభాగం సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి విచ్చేసి పరిశీలించారు. క్లూస్ టీమ్ వివరాలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుంటే, వెంకటేశ్వర కాలనీ వరుస దొంగతనాలతో ప్రజలు హడలిపోతున్నారు. గత నెల 12న సుమారు కోటి రూపాయిల చోరీ జరిగింది. ఈ ఘటన జరిగి నెలరోజులు గడవక ముందే అదే వరుసలో ఉన్న మరో అపార్టుమెంట్‌లో పట్టపగలు దొంగతనం జరగడంతో భయాందోళన చెందుతున్నారు. ఇదే కాలనీలో ఎల్ఐసీ ఉద్యోగి చప్పా శ్రీనివాస్ తన కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న సుమారు కేజీన్నర బంగారు నగలు, 20 లక్షల నగదు, ఇతర వస్తువులను గత నెల 12న దొంగలు దోచుకెళ్లారు. ఇది జరిగి ఇరవై రోజులు గడవక ముందే చోరీ ఘటన చోటుచేసుకోవడంపై కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. వరుస చోరీలు పోలీసులకు తల బొప్పిగా మారాయి. ఒకవైపు ప్రతి అపార్టుమెంట్‌లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచిస్తున్నప్పటికీ అనేక మంది పాటించడం లేదని పోలీసులు చెపుతున్నారు. దీంతో దొంగలు కూడా సీసీ కెమెరాలు, వాచ్‌మెన్ లేని అపార్టుమెంట్లను టార్గెట్‌గా చేస్తున్నారని అంతున్నారు.

మనీలాను సందర్శించిన ఇండియన్ నేవీ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేవీ ఈస్టర్న్ ఫ్లీట్ షిప్స్ ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ శక్తి, ఐఎన్ఎస్ కిల్టాన్ ఆదివారం నాటికి ఫిలిప్పిన్స్‌లోని మనీలా తీరానికి చేరుకున్నాయి. సౌత్ ఈస్ట్ ఆసియా తీరంలో జరగనున్న ఆపరేషనల్ ఎక్సర్‌సైజుల్లో పాల్గొనేందుకు ఇవి అక్కడికి వెళ్లాయి. ఈస్టర్న్ ఫ్లీట్ కమాండింగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్ వీటికి నాయకత్వం వహిస్తున్నారు. ఫిలిప్పిన్స్ నేవీ అధికారులు, సిబ్బంది ఇండియన్ నేవీ నౌకలకు, సిబ్బందికి ఘనంగా స్వాగతం పలికారు. ఇరు దేశాల నేవీల బంధం బలపడేదిశగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇరు దేశాల నేవీ అధికారులు సమావేశమై ఆధునిక సాంకేతిక అమలుపై చర్చించుకున్నారు.



ఇండియన్ నేవీ అధికారికి స్వాగతం పలుకుతున్న ఫిలిప్పిన్స్ నేవీ సిబ్బంది

కరాటేతో ఆత్మరక్షణ : సినీ నటుడు సుమన్



కరాటే విద్యార్థికి ట్రోఫీ అందజేస్తున్న సుమన్

మల్కాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. యారాడ గ్రామంలో ఆంధ్ర షోటోఖాన్ కరాటే - డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ పాల్గొని మాట్లాడారు. కరాటే సాధనతో సంపూర్ణమైన ఆరో గ్యం చేకూరుతుందన్నారు. కరాటే విద్య అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. యారాడ గ్రామంలో ఇటువంటి పోటీలు నిర్వహించడం ఇది తొలిసారి అని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, తెలుగుదేశం గ్రామ నాయకుడు తొత్తరి శ్రీనివాసరావు (చిట్టి), 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేశ్, తదితరులు పాల్గొన్నారు.


ప్రతి చెత్త బండి మొదటగా పోయేది స్క్రాప్ కొట్టుకే....

క్లాప్ కార్మికుల 'స్మార్ట్ శానిటేషన్'!

» ప్లాస్టిక్‌ను సొమ్ము చేసుకుంటున్న వైనం » విధులను గాలికొదిలి స్క్రాప్ కొట్టు వద్ద జపం!

» ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ వట్టిదే » కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న పర్యవేక్షణ లోపం

మురళీనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): "ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్లాస్టిక్‌ను తరిమికొడదాం.. ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. తడి-పొడి చెత్తను వేరుచేసి ఆరోగ్య నగరంగా మార్చడానికి సహకరిద్దాం.. దీన్ని సామాజిక బాధ్యతగా భావిద్దాం.. అంటూ రోజూ సుప్రభాత సమయంలో క్లాప్ వాహనం నుంచి మైకులో హితోక్తులు వినిపిస్తాయి. ఆ శబ్ద తరంగాలకు నిద్రమత్తు వదిలించుకుంటూ నివాసితులు ఇళ్లలోని చెత్త డబ్బాలతో గబగబా క్లాప్ వాహనం వద్దకు చేరుకుంటారు. చేతికి గ్లౌజులు వేసుకుని సిద్ధంగా నిలబడే పారిశుధ్య కార్మికులు ఆ డబ్బాలు తీసుకుని తడి-పొడి చెత్తను వేరు చేసి క్లాప్ వాహనంలో వేర్వేరుగా ఉండే అరలలో వేస్తారనుకుంటే మీరు చెత్తలో చెయ్యేసినట్లే! వారి డేగ చూపులన్నీ ప్లాస్టిక్ సేకరణ కోసం.. ఎంత దొరికితే అంత లాభం అన్నట్లు..! స్క్రాప్ కొట్టువద్ద వేలాడే బోర్డు వారి కళ్ల ముందు కదలాడుతుంది.. ఐరన్ 27 రూపాయలు... ప్లాస్టిక్ రూ.16.. అట్ట పెట్టెలు రూ.12, ఐరన్ రేకులు రూ.20 (ఇవన్నీ కేజీల రేటు).. ఇంకేముంది? విధుల సంగతి దేవుడెరుగు? ముందు ప్రతి ఇంటి నుంచి వచ్చే వ్యర్థాల్లో మనకి పనికొచ్చేవేంటి? వాటిని క్లాప్ వాహనం వెనుక 'భద్రంగా' పెట్టిన పెద్ద పెద్ద సంచుల్లో జాగ్రత్త చేశామా.. స్క్రాప్ దుకాణానికి పోయి అమ్ముకున్నామా! అన్నదే ఆలోచన. క్లాప్ వాహనాల్లో వెళ్లే లోడర్లు, డ్రైవర్లు చేస్తున్న 'స్పెషల్ డ్యూటీ' ఇదే. ఆ తరువాతే, తడి-పొడి-విడి..విడి..ఏదైనా! ఒంటి చేత్తో సంచి భుజాన వేసుకొని తిరిగితే ఎంత దూరం పోగలరు..? అందుకే క్లాప్ కార్మికులకు వారి కోసం ప్రభుత్వ ధనం, ఇంధనంతో నడిచే వాహనాలనే అదనపు ఆదాయం కోసం వినియోగించుకుంటున్నారు. రోజూ వాటిని అమ్ముకుని వచ్చే అదనపు ఆదాయాన్ని (సైడ్ ఇన్‌కమ్) జేబులో వేసుకుంటున్నారు. వైసీపీ ఏలుబడిలో ప్రజలకు భారంగా మారిన చెత్త రుసుం రద్దయినా, కూటమి ప్రభుత్వ పాలనలోనూ చెత్త సేకరణ తీరు మారకపోవడం, పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది.

98 వార్డుల నుంచి తరలుతోంది కేవలం 1200 టన్నులే!

మధురవాడ బీచ్ రోడ్డులోని కాపులుప్పాడ డంపింగ్ కేంద్రానికి రోజూ వెళ్తుంది కేవలం 1200 టన్నుల చెత్త! మొత్తం విశాఖలోని 98 వార్డుల్లో 598 క్లాప్ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలకు అదనంగా మరో 440 పొక్లయిన్లు, డంపింగ్ లారీలు, గార్బేజ్ ట్రక్‌లను నగర పరిశుభ్రత కోసం కేటాయించారు. మన స్మార్ట్ విశాఖను సుందరంగా ఉంచడానికి జీవీఎంసీలో అక్షరాలా అయిదు వేల మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రతి వార్డులో రమారమి 50 మంది పనిచేస్తున్నారు. అయినా నగరం నుంచి 1200 టన్నుల చెత్త మాత్రమే కాపులుప్పాడ డంపింగ్ యార్డుకు చేరగలుగుతోంది. సుమారు 23 లక్షల మంది నివసిస్తున్న విశాఖ నగర జనాభా నుంచి ఇంత తక్కువ పరిమాణంలో మాత్రమే చెత్తను సేకరించగలుగుతున్నారు. కార్మికులు వారి సొంత బేరం చూసుకుని, కాటా లెక్కలు, ఆదాయం చక్కబెట్టుకుని అన్‌లోడ్ పాయింట్‌కి చేరేసరికి కాలం హరించుకుపోతోంది. ఫలితంగా కార్మికుల సంఖ్య పెరిగినా, కొత్త సాంకేతిక విధానాలు, వాహనాలు అందుబాటులోకి వస్తున్నా చెత్త సేకరణ లక్ష్యం చేరడం లేదు. నగరం మురికి కూపంలానే ఉంటోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


క్లాప్ వాహనం వెనుక వేలాడుతున్నవి వ్యక్తిగత చెత్త సేకరణ మూటలు

నగరాన్ని సుందరంగా ఉంచుతాం



నగరాన్ని సుందరంగా ఉంచడానికి శ్రమిస్తున్నాం. కార్మికులు విధుల్లో అలసత్వం ప్రదర్శించినా, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకుంటాం. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగుతూ నిరంతరం విధుల్లో ఉండేలా మార్గదర్శకాలు ఇస్తున్నాం. సంస్కరణలు అవసరమైన ప్రతి సందర్భంలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా అమలు చేస్తున్నాం. వార్డు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శుల సాయంతో మహా విశాఖ నగరపాలక సంస్థను ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రగతి దిశగా తీసుకెళ్లడానికి చర్యలు చేపడతాం. -ఈఎన్‌వీ నరేష్‌కుమార్, సీఎంవోహెచ్, జీవీఎంసీ

ఆ దారిలో నడవాలంటేనే దడ!

» రోడ్డుకిరువైపులా వాహనాలతో ఆక్రమణ

» పట్టించుకోని జీవీఎంసీ, ట్రాఫిక్ అధికారులు

డాబాగార్డెన్స్ ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని డాబాగార్డెన్స్ ప్రాంతమంటే తెలియనివారుండరు. అటువంటి ప్రాంతానికి నిత్యం అనేక పనులపై ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో డాబాగార్డెన్స్ సెంటర్ పాయింట్ జంక్షన్ నుంచి మొదటి మలుపుగా తిరిగే సమయంలో భానుస్ట్రీట్ మొదలయ్యే దారిలో పాదచారులు నడవాలంటేనే గగనమైపోతుంది. ఇక్కడనున్న ఫుడ్‌పాయింట్ సెంటర్స్ ఇతరత్రా దుకాణాలు, వాణిజ్య సముదాయాలకు వచ్చే వారికి ఎంచక్కా రోడ్డే పార్కింగ్ అయిపోయింది. ఇటీవల కాలంలో ఈ సమస్య మరింత జటిలంగా మారిపోయింది. ఇష్టానుసారంగా వాహనదారులు రోడ్డుపైనే తినుబండారాలు ఆరగిస్తూ రాకపోకలు సాగించే వారికి అసౌకర్యం కలిగేలా చేస్తున్నారని, దీంతో ఎటు నుంచి నడవాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడుతుందని పలువురు పాదచారులు ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు, చిన్నపాటి పెద్ద వాహనాలు ఎదురెదురుగా వస్తే ట్రాఫిక్ జామ్ తిప్పలు తప్పవంటూ వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్-4 కార్యాలయానికి, టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే ఇవీ ఉన్నప్పటికీ వీటిని చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. అసలు రోడ్డుపైన పదుల సంఖ్యలో రెండువైపులా పార్కింగ్ చేస్తున్నా వీరికి పట్టనట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బాటసారులు సులభంగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు పాదచారులు, వాహనదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నిరంతర పర్యవేక్షణ

... 5వ పేజీ తరువాయి

నిరంతరం పర్యవేక్షించేలా ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజూ ఐదు కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. ఇప్పటి వరకు ఆయా కేంద్రాల్లో జరిగిన ప్రతి కేసుకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. సృష్టి వ్యవహారం వెలుగులోకి వచ్చిన తరువాత ఇప్పటివరకు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు ఆధ్వర్యంలో 11 ఫెర్టిలిటీ సెంటర్లు, సరోగసీ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. మిగిలిన వాటిని అధికారులు తనిఖీ చేయనున్నారు.

రెండో దశలో ఆస్పత్రుల తనిఖీ

మొదటి దశలో సరోగసీ, ఫెర్టిలిటీ సెంటర్లలో తనిఖీలు నిర్వహించేలా నిర్దేశించారు. రెండో దశలో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు, డెంటల్ హాస్పిటల్స్‌లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డెంటల్ క్లినిక్స్ 252 ఉన్నాయి. వీటిని నిరంతరం పర్యవేక్షించేలా సదరు అధికారులకు ఆదేశాలు అందాయి. ఫెర్టిలిటీ సెంటర్లు, సరోగసీ కేంద్రాలకు సంబంధించి బాధితులు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నట్టు సమాచారం ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు ఆయా కేంద్రాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. ఏదైనా సమస్య వెలుగులోకి వచ్చిన తరువాత అధికారులు హడావిడి చేయడం, తరువాత పక్కన పెట్టేయడం పరిపాటిగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ ఫోన్లు మాకొద్దు!

... 5వ పేజీ తరువాయి

రద్దుచేయాలని, కేంద్రాల నిర్వహణకు 5జీ నెట్‌వర్క్‌తో కొత్త ట్యాబ్‌లు ఇవ్వాలని కోరుతున్నారు. వేతనాలు పెంచాలని, మినీల్లో పనిచేసేవారిని మెయిన్ వర్కర్లుగా మార్చుతూ జీవో విడుదల చేయాలని, గ్రాట్యూటీ జీవోలో మార్పులుచేయాలని, హెల్పర్ల ప్రమోషన్లకు గైడ్‌లైన్స్ రూపొందించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం అధికారులకు వినతిపత్రాలు అందించాలని నిర్ణయించారు.

ఇంటర్‌లో పెరిగిన ప్రవేశాలు

... 5వ పేజీ తరువాయి

రెండుమూడు చోట్ల ప్రవేశాలు పెరిగాయి. గాజువాకలో ఎంపీసీ 26, బైపీసీ 42 మొత్తం 68 మంది, గోపాలపట్నంలో ఎంపీసీ, బైపీసీలో 95 మంది చేరారు. రాంపురంలో ఏంపీసీలో ఒకరు, బైపీసీలో ముగ్గురు మాత్రమే చేరారు. గంగవరంలో ఎంపీసీలో కేవలం ఐదుగురు ఉండగా, బైపీసీలో 18మంది చేరారు. మల్కాపురంలో ప్రథమ ఏడాది ప్రవేశాలు లేవు. ఇక్కడ ద్వితీయ ఏడాదిలో 22 మంది అదే ప్రాంగణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతులకు హాజరవుతున్నారు. సీతమ్మధార ఎన్ఎంసీ పాఠశాలలో రెండు గ్రూపులకు ప్రథమ ఏడాదిలో 20మంది చేరారు. ఇక్కడ ఏడుగురు పీజీటీలుండగా నలుగురికి హెచ్ఎంలుగా పదోన్నతి రావడంతో ఉన్న ముగ్గురే పాఠాలు బోధిస్తున్నారు.

మెకానికల్‌లో అడ్వైజర్ గోల

... 5వ పేజీ తరువాయి

చెప్పేందుకు సాహసించలేకపోతున్నారు. అంతేకాకుండా ఈ విభాగంలోని వాహనాల మరమ్మతులకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కమిషనర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులకు తెలిసేలా ఒక ప్రైవేటు ఏజెన్సీ రూపొందించిన యాప్‌కు బిల్లు చెల్లించాలని ప్రతిపాదించినట్టు తెలిసింది. ఇటీవల మెకానికల్ విభాగంపై కమిషనర్ సమీక్ష నిర్వహించినపుడు ఈ యాప్‌పై సూచించినట్టు చెబుతున్నారు. గతంలో 'ఇంట్రోల్యాబ్స్' అనే సంస్థ అభివృద్ధిచేసిన యాప్‌ను వాహన రిపేర్లను ట్రాకింగ్ చేయడానికి వినియోగించేవారు. అందుకోసం ఏజెన్సీకి జీవీఎంసీ నుంచి నెలకు రూ.70 వేలు చెల్లించేవారు. గత ఆరు నెలలుగా ఆ యాప్ పనిచేయడంలేదు. తాజాగా అదే యాప్ సేవలను వినియోగించుకుంటే పనిచేయని ఆరునెలలకు బిల్లు పెట్టించి కొట్టేయవచ్చని కమిషనర్ వద్ద ప్రస్తావించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మెకానికల్ విభాగంలో అనుభవం, నైపుణ్యం ఉన్న ఇంజనీర్లుండగా, ప్రైవేటు వ్యక్తికి నియమించాల్సిన అవసరమేమిటని ఆ విభాగం అధికారులు ప్రశ్నిస్తున్నారు.

మహా దోపిడీ

... 5వ పేజీ తరువాయి

సమాయత్తమవుతున్న సమయంలో బదిలీ అయిపోయింది.

అక్రమాలపై ఆరోపణలు

ఫాగింగ్‌లో అక్రమాలు జరుగుతున్నట్టు ఆరోపణలుండగా, నిధులు చాలడం లేదని అదనంగా కేటాయించాలని మలేరియా విభాగం అధికారులు జీవీఎంసీ ఉన్నతాధికారులకు విన్నవించినట్టు తెలిసింది. ఫాగింగ్‌కు నెలకు రూ.58.79 లక్షలు కేటాయిస్తుండగా, మూడు నెలలుగా అదనంగా రూ.24.69 లక్షలు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించినట్టు సమాచారం. ఫాగింగ్ పేరుతో కొంతమంది అధికారులు, సిబ్బంది నిధులను నొక్కేస్తున్నారని కొందరు కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. ఇందులో కొందరు కార్పొరేటర్లకు, అధికారులకు వాటాలు అందుతుండడంతో అక్రమాలకు అండగా నిలుస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనిపై కమిషనర్ కేతన్‌గార్గ్ దృష్టిసారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిరాధార ఆరోపణలు

ఫాగింగ్ పేరుతో జరుగుతున్న అక్రమాలపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ వద్ద ప్రస్తావించగా అక్రమాలు జరగడానికి అవకాశమే లేదని కొట్టిపారేశారు. గిట్టనివారే ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. మలేరియా విభాగంలో ప్రస్తుతం ఆరు మెగా ఫాగింగ్ యంత్రాలతోనే ఫాగింగ్ జరుగుతోందన్నారు. గంటకు వందలీటర్లు డీజిల్ ఖర్చవుతోందని గత కమిషనర్ విచారణలో కూడా తేలిందని చెప్పడం కొసమెరుపు.

యూసీడీలో దోపిడీపై ఆరా!

... 5వ పేజీ తరువాయి

ఫీజుగా రూ.300కు బదులు యూసీడీ సిబ్బంది రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని మహిళా సంఘాల సభ్యులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల ఒకటిన 'యూసీడీ దోపిడీ' శీర్షికన కథనం ప్రచురితమయింది. దీనిపై స్పందించిన మెప్మా ఎండీ, జీవీఎంసీ కమిషనర్ వేర్వేరుగా యూసీడీ పీడీకి ఫోన్‌చేసి ఆరా తీసినట్టు తెలిసింది. విచారణ జరిపి బాధ్యులను గుర్తించి నివేదిక పంపాలని ఆదేశించినట్టు సమాచారం. ఈ మేరకు యూసీడీ పీడీ సత్యవేణి జోన్‌లవారీగా విచారణ జరిపారు. కొన్నిచోట్ల అదనంగా రూ.200 వసూలుచేసినట్టు తేలిందని కొంతమంది యూసీడీ సిబ్బంది చెబుతున్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే చెడు వ్యసనాలకు దూరం


స్నేహితుల దినోత్సవంలో పాల్గొన్న అంగటి శ్రావణకుమార్ తదితరులు

మహారాణిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే ఆరోగ్య పరిరక్షణతో పాటు అందరి మధ్య ఐక్యత పెరిగి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని జనసేన 29వ వార్డు అధ్యక్షుడు అంగటి శ్రావణకుమార్ అన్నారు. ఆదివారం మహారాణిపేట జిల్లా పరిషత్ జంక్షన్ వద్ద ఫ్రెండ్‌షిప్ డే వేడుకలు నిర్వహించారు. ముందుగా మొక్కలు నాటి అనంతరం ఫ్రెండ్స్ ప్రీమియర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి ఫ్రెండ్‌షిప్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రావణకుమార్ మాట్లాడుతూ ఫ్రెండ్స్ ప్రీమియర్ లీగ్‌లో 8 జట్లుగా 104 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమణ, మహేష్, ఈశ్వర్, కిషోర్, రాకేష్, త్రినాథ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వెటరన్ క్రీడాకారులకు నగర పోలీస్ కమిషనర్ అభినందన

మురళీనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025లో పతకాలు సాధించిన నగర క్రీడాకారులను విశాఖపట్నం నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేకంగా అభినందించారు. మురళీనగర్ వనితా వాకర్స్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మలేసియా, శ్రీలంక దేశాల్లో ఇటీవల జరిగిన ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ, కాంస్య, రజత పతకాలు అందుకున్న అథ్లెట్స్ ఎం.రామారావు, కేబీవీఎం.కృష్ణప్రసాద్, కె.పూర్ణిమ, కె.మత్స్యకొండలకు ప్రశంసాపత్రాల్ని, జ్ఞాపికలను సీపీ అందజేశారు. వారి క్రీడాస్ఫూర్తికి శుభాభినందనలు తెలిపారు. వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ విశాఖపట్నం (వావ్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పతక సాధకులు, అతిథులు, నిర్వాహకులు బృందచిత్రం దిగి సంతోషం పంచుకున్నారు. అసోసియేషన్ చీఫ్ పేట్రన్ కమల్ బయిద్, వావ్ ప్రెసిడెంట్ మంగప్రసాద్, కో-ఆర్డినేటర్ సి.హెచ్.శ్రీనివాసరాజు, వైశాఖీ స్పోర్ట్స్ పార్కు కార్యదర్శి పి.ఎస్.ఎన్.రాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, వనితా వాకర్స్ సభ్యులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వీరి విజయం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు.



నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో వెటరన్ క్రీడాకారులు, వావ్ క్లబ్ ప్రతినిధులు

నృత్య కళలను ప్రోత్సహించాలి

» ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్

సీతమ్మధార, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంప్రదాయంలో భాగమైన సంప్రదాయ నృత్య కళలను, కళాకారులను తప్పనిసరిగా ప్రోత్సహించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పేర్కొన్నారు. మధురానగర్, శంకరమఠం ఎదురుగా గల పద్మశాలి భవన్‌లో నటరాజ నృత్య నికేతన్ వ్యవస్థాపకులు, నాట్యగురువు నటరాజ పరమేశ్వరన్ ఆధ్వర్యంలో విద్యార్థినుల గజ్జ పూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ నృత్య కళాకారులతోనే సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. కళాకారుల కోసం నాట్య గురువు నటరాజ పరమేశ్వరన్ చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కె.సన్యాసిరావు, టి.వెంకటేశ్వర్లు, కె.వెంకటేశ్వర్లు, కె.సత్యనారాయణ, బీపీఎస్ కల్యాణి, వి.కృష్ణమోహన్, భక్త మార్కండేయ, ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.


నృత్య కళాకారులతో అతిథులు

ఘనంగా స్నేహితుల దినోత్సవం


ఆత్మీయ సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

అల్లిపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అల్లిపురంలోని రైల్వే వైర్లెస్‌కాలనీ ఉన్నత పాఠశాలలో 1987-88లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కలుసుకున్నారు. వారి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో కలిసి పంచుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అనేక మంది విచ్చేశారు. తమకు చదువులు నేర్పించిన అప్పటి ఉపాధ్యాయులను గుర్తుచేసుకొని మృతిచెందిన వారికి నివాళుల ర్పించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. ఆపదలో ఉండే తమ స్నేహితులకు ఆర్థికసహాయం అందించేవిధంగా ప్రణాళికలు వేసుకున్నారు.

'సభాపతి గౌరవానికి భంగం కలిగించలేదు'

సీతంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):శాసన సభాపతి అయ్యన్న పాత్రుడుకి క్షమాపణ చెబుతున్నానని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఎప్పుడూ మాట్లడలేదని పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయ్యన్నకు అన్యాయం చేసిన వైసీపీ వ్యక్తులకే కూటమి ప్రభుత్వంలో అప్పనంగా మాజీ సైనిక ఉద్యోగి భూమికి ఎన్‌ఓసీ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశానన్నారు. రాయలసీమ వ్యక్తికి మాజీ సైనికోద్యోగిగా విశాఖలో భూమి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అయ్యన్న తమ్ముడి కుమారుడు, వైసీపీ సానుభూతిపరుడు వరుణ్ ఈ వ్యవహారం నడిపారని, కూటమి ప్రభుత్వంలో రూ.100 కోట్ల విలువైన భూములు ఫాబ్రికెట్ చేసి కొట్టేశారన్నారు. సన్యాసిపాత్రుడికి మేలు చేసేలా అధికారులు సహకరించారన్నారు. ఈ వ్యవహారంపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని మూర్తియాదవ్ డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మూర్తియాదవ్

కాలనీల్లో ఇష్టారాజ్యంగా కేబుల్స్ ఏర్పాటు

» తెగిపడిన వైర్లతో ఆందోళన

» విద్యుత్ వైర్లో, కేబుల్స్ వైర్లో తెలియక భయం


ఎఫ్‌సీఐ కాలనీ రహదారిలో తలకు తగిలేలా వేలాడుతున్న బాక్స్‌తో కూడిన కేబుల్

మద్రిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధి 53వ వార్డు పరిధిలోని కాలనీల్లో పలు ఇంటర్‌నెట్ సంస్థల సిబ్బంది తమ కేబుల్స్‌ను ఇష్టారాజ్యంగా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేస్తుండటం పట్ల ఆయా కాలనీలవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో విద్యుత్ సరఫరా అయ్యే స్తంభాలకు పెద్దఎత్తున కేబుల్ వైర్లతోపాటు వాటికి సంబంధించిన బాక్స్‌లను కూడా అమర్చడంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల వద్ద పిచ్చుకగూళ్లను తలపిస్తుంటే, మరోపక్క ప్రధాన రహదారులు పందిర్ల మాదిరిగా కనిపిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలపై కేబుల్‌వైర్లను భారీసైజ్‌లో చుట్టేసి ఆయా బండిల్స్ స్తంభాలకు కట్టేస్తున్నారు. దీనితో స్తంభాల నుంచి విద్యుత్ సరఫరా పొందుతున్నవారు ఎప్పుడైన వారికి సరఫరాలో ఆటంకం కలిగినప్పుడు మరమ్మతులు చేసుకోవాలంటే ఏది విద్యుత్ ప్రవహించే వైరో, ఏది కేబుల్ వైరో తెలియక తికమకపడుతున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం బారిన పడతామోనని భయపడుతున్నారు. మరికొన్ని చోట్ల స్తంభాలకు ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లు తెగి రోడ్లపై చెల్లాచెదురుగా పడి ఉండటంతో ఆయా రహదారుల నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయపడుతున్నారని పలువురు చెబుతున్నారు. కేబుల్స్ పెద్దఎత్తున ఏర్పాటు చేయడంతో వర్షాలు పడే సందర్భంలో గాలులు వీచినప్పుడు ఆయా వైర్ల రాపిడికి అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటూ ఆందోళన చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా పలు సంస్థలు ఇష్టారాజ్యంగా కేబుల్, ఇంటర్‌నెట్‌కు సంబంధించిన కేబుల్స్‌ను విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బందులు పడేలా వ్యవహరిస్తున్నాయని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సాయినగర్ ప్రధాన రహదారిలో పందిరిని తలపిస్తున్న కేబుల్ వైర్లు

అనాథ మృతదేహానికి స్వచ్ఛంద ప్రతినిధుల అంత్యక్రియలు


శ్మశాన వాటికకు మృతదేహం తరలింపు

జ్ఞానాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం మదర్‌థెరిస్సా ఆశ్రమం సమీపంలో రోడ్డుపై గుర్తుతెలియని అనాథ మరణించడంతో అవర్‌హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం అంత్యక్రియలు జరిపించారు. సంస్థ సభ్యులు పిల్లి గోవిందరాజు, శ్యామ్‌సుందర్ రెడ్డి, సానబాని ఫ్రాన్సిస్‌లు స్థానిక 41వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఐతి మదుబాబు, రవిబాబుల ఆర్థిక సహకారంతో అంబులెన్స్ తెప్పించారు. మృతదేహానికి కాన్వెంట్ శ్మశానవాటికలో ఇన్‌చార్జ్ ప్రసన్న కుమార్ సహకారంతో అంత్యక్రియలు జరిపించారు.

అమర్‌నాథ్ క్షమాపణ చెప్పాలి: హేమంత్‌కుమార్

డాబాగార్డెన్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్ తక్షణమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నారా లోకేశ్‌లకు క్షమాపణ చెప్పాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో ఐటీ మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ ఎన్ని కంపెనీలు, ఉద్యోగాలు తెచ్చారో చెప్పాలన్నారు. ఇదే విషయమై బహిరంగ చర్చకు గాజువాక సెంటర్‌లో ఈ నెల 5లోగా వచ్చి నిరూపించాలని సవాల్ విసిరారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు కారకులు జగన్, విజయసాయిరెడ్డిలే అన్నారు. అమర్‌నాథ్ విశాఖ ప్రజల దృష్టిలో ఇంకా పాఠశాల విద్యార్థితో సమానమన్నారు. ఆయనకు ఐటీ మంత్రిగా అవకాశం ఇస్తే కనీసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతించాల్సిన ఐటీఐ ఇనిస్టిట్యూట్ కూడా తేలేకపోయిన అసమర్థుడు అన్నారు. మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాలు గత వైసీపీ సర్కార్ గాలికి విడిచిపెడితే నిరుద్యోగులపై అభిమానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు వాటి ప్రక్రియను ఇటీవల పూర్తి చేసిన సంగతి అమర్‌నాథ్‌కు తెలియలేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో జి.గోవిందు, వాసుపల్లి రాంబాబు, శివ, అభిరామ్, గౌరీష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్, ఇతర ప్రతినిధులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహునికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడామండప ప్రదక్షిణలు చేశారు. భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు సిరి సంపెంగలతో పూజలు జరి పారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. అంతకముందు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి నారసింహ అష్టోత్తర శతనామావళితో అర్చన జరిపారు. భక్తులు గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.



హద్దు మీరితే కఠిన చర్యలు: సీఐ

సీతంపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మంచి ప్రవర్తనతో నడుచుకుని సమాజంలో ముందుకు సాగాలని, హద్దు మీరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని సీఐలు ఎ.సత్యనారాయణ, రమణలు రౌడీషీటర్లను హెచ్చరించారు. నాలుగో పట్టణం, ద్వారకా పోలీసు స్టేషన్ల పరిధిలో గల రౌడీషీటర్లకు పోలీసు స్టేషన్ల ఆవరణలో ఆదివారం కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు వారికి పలు అంశాల్లో హెచ్చరికలు చేశారు. సత్ప్రవర్తనతో మెలగుతూ, పోలీసులకు తమ కదలికలపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని ఆదేశించారు. ఎవరైనా బయట ప్రాంతాలకు వెళ్లినప్పుడు సంబంధిత పోలీసు స్టేషన్‌లో లేదా వారిని పర్యవేక్షిస్తున్న పోలీసులకు తెలియజేయాలన్నారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్యనారాయణ

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు



ఆటోనగర్,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డు కూర్మన్నపాలెం సంపత్ వినాయక ఆలయంలో, 70 వార్డు చట్టివానిపాలెంలో సూర్యనారాయణ మూర్తికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. శ్రావణమాసం వేడుకల్లో భాగంగా శివాజీ శర్మ, కిశోర్ శర్మల ఆధ్వర్యంలో జరిగిన ఈపూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెలలో 147 మంది పదవీ విరమణ

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెలలో 147మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్నారు. సాధారణంగా ప్లాంట్‌లో జూన్, జూలై నెలల్లో పదవీ విరమణలు ఎక్కువగా ఉంటాయి. కానీ ఈ ఏడాది రికార్డు స్థాయిలో జూన్ నెలలో 238 మంది, జూలైలో 121 మంది ఉద్యోగులు రిటైరయ్యారు. మళ్లీ ఈ నెల మరో 147మంది పదవీ విరమణ చేయనున్నారు. ఒకేసారి ఇంత మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయడంతో పాటు రానున్న రోజుల్లో రెండో వీఆర్ఎస్ ద్వారా మరికొంత మంది ఉద్యోగులు ఉద్యోగాలను వీడనున్నారు.

62 మంది రక్తదానం

అగనంపూడి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సత్యసాయి శతదినోత్సవాలను పురస్కరించుకొని స్థానిక సత్యసాయి భజన మండలి, హోమీబాబా కేన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం అభిరామ్ గృహసముదాయం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 62 మంది స్వచ్ఛందగా విచ్చేసి రక్తాన్ని దానం చేశారు. తొలుత ఈ శిబిరాన్ని డాక్టర్ చారుమతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రక్తదాన దానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎన్.రావు, మడుగుల నరసింగరావు, బి. సత్యనారాయణ, రామకృష్ణ, నాయుడు, విందుల పైడినాయుడు, రవికుమార్, వెంకటకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత

» అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు » సమస్యల పరిష్కారానికి హామీ

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కాలనీలలో ప్రభుత్వం నిర్మించే సామాజిక భవనాలు, కల్యాణ మండపాలను పరిరక్షించుకుంటూ అభి వృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 69 వార్డు పరిధిలో హరిజన జగ్గయ్యపాలెం, తుంగ్లాం, నాతయ్యపాలెం కాలనీలలో సుమారు ఆరున్నర కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న రహదారులు, కాలువల నిర్మాణ పనులకు ఆదివారం హరిజన జగ్గయ్యపాలెంలో శంకుస్థాపన చేశారు. అలాగే, ఇక్కడి నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో ఉన్న చెరువు ఆక్రమణ గురికాకుండా చూడడంతో పాటు భావితరాలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా నిర్మిస్తున్న ఈఎస్ఐ ఆసుపత్రిలో ఇక్కడి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా కృషిచేస్తానని స్పష్టం చేశారు. వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గాన్ని ఆదర్శంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తీర్చిదిద్దుతున్నారని వివరించారు. అనంతరం స్థానికంగా సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కూటమి నాయకులు అలమండ రాజు, అక్కిరెడ్డి శ్రీను, వంగలపూడి గోపి, వి.జీవన్‌బాబు, జి.రామాంజనేయులు, గోపిశెట్టి గోపి, ఎర్రా మధులత, శీరం రాజేష్, ఈటి శ్రీను, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



హరిజన జగ్గయ్యపాలెం అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే పల్లా

వైసీపీ నుంచి పలువురు జనసేనలో చేరిక



వైసీపీ నుంచి జనసేనలో చేరిన వారితో డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు

అగనంపూడి. ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ- బోనంగికి చెందిన వైసీపీ నాయకులు గొల్లవిల్లి పైడిరాజు, సతీశ్‌కుమార్, నరేశ్, బుగిడి సతీశ్, సేవాపతి జువ్వాలు ఆ పార్టీకి రాజీనామా చేసి తమ అనుచరులతో కలిసి ఆదివారం జనసేనలో చేరారు. వీరందరికీ ఆ పార్టీ నేత డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, వార్డు అధ్యక్షుడు గవర సోమశేఖర్‌కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు సురేశ్, శివాజీ, శ్రీనివాసరావు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మింది హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సందడి



గురువుల సత్కారంలో పూర్వ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్ర జ్యోతి) : మింది హైస్కూల్‌లో 1990-91లో పదవ తరగతి చదివిన వారంతా ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భం గా వారి ఆనందానికి అవధులు లేవు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గరురువులు కె.అప్పలరాజు, ఎ.జగన్నాథంతో పాటు ప్రస్తుత హెచ్ఎం పీవీ అంజనేయులను ఘనంగా సత్కరించారు. నిర్వాహకులు జి.శ్రీనివాసరావు, పి.త్రినాథ్, జి.అనురాధ, చుక్క శ్రీనివాస్, షేక్ అలీ లను అంతా అభినందించారు.

దంత వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పెదగంట్యాడ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 76వ వార్డు బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీలో ఆదివారం ఉచిత మెగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వీటెల్ డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరాన్ని వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు ప్రారంభించారు. త్వరలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు రాజేష్, నాయకులు మనోహర్, పెంటారావు రమణ తదితరులు పాల్గొన్నారు.

160 మందికి వైద్య పరీక్షలు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 68వ వార్డు టీడీపీ కమిటీ, మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం అక్కిరెడ్డిపాలెంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 160 మందికి వైద్య సిబ్బంది పరీక్షలు జరిపారు. అనంతరం మందులను అందజేసి ఆరోగ్య పరిరక్షణకు పలు సూచనలు చేశారు. టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, జి.తాతారావు, డొప్ప అప్పలరాజు, బొడ్డు వెంకటరమణ, ఎల్‌మురళి, ఎస్.వెంకటరావు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీ

» భార్య, భర్త విధులకు వెళ్లగా పట్టపగలు చొరబడిన దొంగలు
» ఎనిమిది తులాల బంగారు, ఐదు తులాల వెండి ఆభరణాలు అపహరణ
» వెంకటేశ్వర కాలనీలో ఘటన » 20 రోజుల్లో ఇది రెండోసారి..



నీలిమ ఇంట్లో దొంగలు చిందర వందరగా పడేసిన వస్తువులు

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో శనివారం పట్టపగలు ఓ అపార్టుమెంట్‌లో చోరీ జరిగింది. సుమారు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదును దొంగిలించుకుపోయారు. ఈ ఘటనకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలి. వెంకటేశ్వర కాలనీలో గల ఎస్ఎల్ ఈశ్వరి విహార్ అపార్టుమెంట్ మూడవ అంతస్థులో ఇక్కడి విమానాశ్రయంలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నీలిమ తన భర్త రాజుతో కలిసి నివాసం ఉంటున్నారు. రాజు స్థానికంగా ఉన్న ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తుంటారు. శనివారం ఉదయం ఈ భార్యభర్త ఇద్దరూ వారివారి విధులకు వెళ్లారు. సాయంత్రం నీలిమ ఇంటికి రాగా, తలుపు గడియ తొలగించి ఉండడంతో ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా, సామగ్రి చిందరవందరగా పడి ఉండడంతో పాటు కప్‌బోర్డులో ఉంచిన సుమారు ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, ఐదు తులాల వెండి వస్తువులు, సుమారు ఆరు వేల రూపాయల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీంతో ఆమె వెంటనే గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. క్రైమ్ విభాగం సీఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి విచ్చేసి పరిశీలించారు. క్లూస్ టీమ్ వివరాలను సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుంటే, వెంకటేశ్వర కాలనీ వరుస దొంగతనాలతో ప్రజలు హడలిపోతున్నారు. గత నెల 12న సుమారు కోటి రూపాయిల చోరీ జరిగింది. ఈ ఘటన జరిగి నెలరోజులు గడవక ముందే అదే వరుసలో ఉన్న మరో అపార్టుమెంట్‌లో పట్టపగలు దొంగతనం జరగడంతో భయాందోళన చెందుతున్నారు. ఇదే కాలనీలో ఎల్ఐసీ ఉద్యోగి చప్పా శ్రీనివాస్ తన కుమార్తె పెళ్లి కోసం దాచుకున్న సుమారు కేజీన్నర బంగారు నగలు, 20 లక్షల నగదు, ఇతర వస్తువులను గత నెల 12న దొంగలు దోచుకెళ్లారు. ఇది జరిగి ఇరవై రోజులు గడవక ముందే చోరీ ఘటన చోటుచేసుకోవడంపై కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. వరుస చోరీలు పోలీసులకు తలబొప్పిగా మారాయి. ఒకవైపు ప్రతి అపార్టుమెంట్‌లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచిస్తున్నప్పటికీ అనేక మంది పాటించడం లేదని పోలీసులు చెపుతున్నారు. దీంతో దొంగలు కూడా సీసీ కెమెరాలు, వాచ్‌మెన్ లేని అపార్టుమెంట్లను టార్కెట్‌గా చేస్తున్నారని అంతున్నారు.

ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీ

కూర్మన్నపాలెం,ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు తిరుమలనగర్ కాలనీవాసులు ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని విడనాడి గుడ్డ సంచులనే వాడాలని, కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, అలాగే చేపలు, మాంసం దుకాణాలకు విధిగా స్టీల్ బాక్స్‌లు తీసుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంత రెడ్డిలతో పాటు పలువురు కాలనీ మహిళలు పాల్గొన్నారు.

మనీలాను సందర్శించిన ఇండియన్ నేవీ అధికారులు

విశాఖపట్నం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ నేవీ ఈస్టర్న్ ఫ్లీట్ షిప్స్ ఐఎన్ఎస్ ఢిల్లీ, ఐఎన్ఎస్ శక్తి, ఐఎన్ఎస్ కిల్తాన్ ఆదివారం నాటికి ఫిలిప్పిన్స్‌లోని మనీలా తీరానికి చేరుకున్నాయి. సౌత్ ఈస్ట్ ఆసియా తీరంలో జరగనున్న ఆపరేషనల్ ఎక్సర్‌సైజుల్లో పాల్గొనేందుకు ఇవి అక్కడికి వెళ్లాయి. ఈస్టర్న్ ఫ్లీట్ కమాండింగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ సుశీల్ మీనన్ వీటికి నాయకత్వం వహిస్తున్నారు. ఫిలిప్పిన్స్ నేవీ అధికారులు, సిబ్బంది ఇండియన్ నేవీ నౌకలకు, సిబ్బందికి ఘనంగా స్వాగతం పలికారు. ఇరు దేశాల నేవీల బంధం బలపడేదిశగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇరు దేశాల నేవీ అధికారులు సమావేశమై ఆధునిక సాంకేతిక అమలుపై చర్చించుకున్నారు.



ఇండియన్ నేవీ అధికారికి స్వాగతం పలుకుతున్న ఫిలిప్పిన్స్ నేవీ సిబ్బంది

ఏకేసీ కాలనీలో ఫ్లెక్సీ రగడ

సింధియా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో వైసీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు బ్లేడుతో కోసి చింపివేయడంపై వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మల్కాపురం పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేసినా అధికారపార్టీ నాయకులుభయపెట్టి రాజీ చేశారని వాపోయారు. ఫ్లెక్సీ చించిన వారిపై చట్టపరమైనచర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 40, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 32, బీరకాయలు 48, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 40, బంగాళదుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 74, బరబాటి 44, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో)50, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 80, కీరదోస 30, కాప్సికమ్ 68, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, కంద 42, దేముడుచిక్కుడు 102, గోరు చిక్కుడు 42, కూర పెండలం 30, బ్రకోలి 45, పనసపొట్టు160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	83
లైవ్ ధర	103
విత్ స్కిన్	176
స్కిన్‌లెస్	186

సమస్యలు పరిష్కరించే ప్రజా ప్రతినిధులకే విలువ

» పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

వేపగుంట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించే ప్రజాప్రతినిధులకుసమాజంలో విలువ పెరుగుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. వేపగుంట పరిధి చిమలాపల్లి రోడ్‌లో నూతనంగా వీఎంఆర్‌డీఏ నిధులు రూ.8 కోట్లతో నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ దశాబ్దకాలంగా నిర్లక్ష్యానికి లోనైన వేపగుంట నుంచి పినగాడి వెళ్లే రోడ్డు సమస్య పరిష్కారం చూపిన వుడా అధికారులు, చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత పాలకులు స్వార్ధ రాజకీయాలకు పెద్దపీట వేశారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ, అభివృద్ధి పనులకుప్రాధాన్యం ఇస్తోందన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ అభివృద్ధికి వేసిన బృహత్‌ప్రణాళిక అనుగుణంగా ముందుకు సాగుతున్నామన్నారు. రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు చెప్పారు. కమిషనర్ కె.ఎస్. విశ్వనాథ్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ప్రజల సహాయ సహకారాలు అవసరమన్నారు.

రూ. 67 కోట్లతో రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపన

ఈ వేదిక ప్రాంగణంలోనే వీఎంఆర్‌డీఏ నిధులు రూ.67 కోట్లతో చేపట్టనున్న రహదారులుకు శంకుస్థాపన ఫలాకాలను ఆవిష్కరించారు. వీటిలో వేపగుంట నుంచి పినగాడి రహదారికి రూ. 15 కోట్లు, లంకెలపాలెం అనకపల్లి దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్లను కలుపుతూ నిర్మించనున్న 100 అడుగుల రోడ్డుకు రూ.31 కోట్లు, దువ్వాడ నుంచి గొల్లలపాలెం అమృతపురం వరకు 60 అడుగుల రోడ్డుకు రూ. రూ. 24.50కోట్లు, అనకాపల్లి నుంచి జాతీయ రహదారి నుంచి సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలవరకు 40 అడుగుల రోడ్డు రూ.58.50లక్షలతో నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, సేనాపతి వసంత శంకరరావు, ముమ్మనదేముడు, పెందుర్తి పీఏసీ చైర్మన్ అయిత సింహాచలం, జోన్ 8 కమిషనర్ కె.హైమావతి కూటమి నాయకులు పిన్నింటి పార్వతి, దాట్ల మధు, నాగరాజు, శ్రీనివాసరావు, కిరణ్, వర్మ తదితరులు పాల్గొన్నారు. ముందుగా జనసేన టీడీపీ నాయకులు గోశాల జంక్షన్ నుంచి వేపగుంట కన్వెన్షన్ సెంటర్ వరకుబైక్ ర్యాలీగా వచ్చి ఎమ్మెల్యే రమేష్‌బాబు, ప్రణవ్‌గోపాల్‌కు స్వాగతం పలికారు.



:వేపగుంట కన్వెనషన్ సెంటర్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల, ఉడా చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్, తదితరులు

ప్రొటోకాల్ పాటించకపోవటంపై అసంతృప్తి

వేపగుంట కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవం శిలాఫలకంపై తన పేరు లేకపోవటంతో ఉడా అధికారులపై కార్పొరేటర్ ముమ్మన దేముడు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ విషయంపై అధికారులతో అధికారులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

హెచ్‌పీసీఎల్ కో- ఆపరేటివ్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక



ఎమ్మెల్యే గణబాబును కలిసిన హెచ్‌పీసీఎల్ కో ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

మల్కాపురం, ఆగస్టు 3 (ఆం ధ్రజ్యోతి): హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కాంట్రాక్ట లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక ఎట్టకేలకు జరిగింది. ఇప్పటి వరకు ఈ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఉన్న వెంకటరమణ, పైడిరాజులను పాలకవర్గంలో డైరెక్టర్ల అవిశ్వాసం ప్రకటించి తొలగించారు. అనంతరం జాప్యం చోటు చేసుకుంది. సొసైటీ జిల్లా అధికారుల జోక్యంతో సొసైటీ అధ్యక్షుడిగా ఎం.ధనంజయరావు, ప్రధాన కార్యదర్శిగా సర్వసిద్ధి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా వై.అప్పలరాజు, కోశాధికారి వైఎ బాస్కర్, డైరెక్టర్స్ సీహెచ్ అప్పలరాజు, సీహెచ్ శ్రీనివాసరావు, సభ్యులుగా జి.శ్రీనివాసరావు, ఎన్.రాజు, ఎస్.సన్యాసిరావు, కె.కృష్ణ, హరిబాబు నియమితులయ్యారు. అనంతరం ఎమ్మెల్యే గణబాబును కో ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యవర్గం కలిసింది.

'వాటర్ ట్యాంక్ స్థలం ప్రజాపయోగానికే వినియోగం'

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బాజీ జంక్షన్‌లో వాటర్ ట్యాంక్ ఉన్న 20 గజాల స్థలాన్ని ప్రజా ఉపయోగానికి వినియోగించేందుకు చర్యలు చేపడుతున్నట్టు శ్రీ వీరాంజనేయస్వామి బాజీ జంక్షన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో వాటర్ ట్యాంక్ ద్వారానీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం కొళాయిలు నీటి సరఫరా చేస్తున్నారన్నారు. వేసవిలో మాత్రం నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడి ఖాళీగా ఉన్న 20గజాల స్థలంలో ఆర్వో ప్లాంట్ పెట్టి ప్రజలకు ఉచితంగా నీరందించేందుకు చూస్తున్నామన్నారు. అయితే, ఈ స్థలాన్ని కబ్జా చేస్తున్నట్టు వచ్చిన తప్పుడు ప్రచారాన్ని అయన ఖండించారు. అలాగే, ట్యాంక్ ఎదురుగా పశ్చిమ భాగంలో ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది కబ్జా చేశారని, దీని పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు.

గురుద్వారలో సీపీ ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

సింధియా ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి):నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ షిప్‌యార్డు కాలనీలో ఉన్న సిక్కుల పవిత్ర దేవాలయం గురుద్వారను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తొలుత సిక్కు సోదరలందరికీ ఆయన స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ మైనారిటీల సంరక్షణ కోసం చర్యలు తీసుకుంటామన్నారు. ఏ సమస్య వచ్చినా తన ఫోన్: 7995095799కు చెప్పాలని తెలిపారు. అనంతరం సిక్కుమత పెద్దలు పోలీసు కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు.

పాత్రికేయుల సంఘ భవనానికి కృషి: ఎమ్మెల్యే

మల్కాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం తొలి అవిర్భావ దినోత్సవం ఆదివారం గాజువాక ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న గోకుల యాదవ సామాజిక భవనంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు), మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ పాల్గొని వేర్వేరుగా వార్షికోత్సవం కేక్‌ను కట్‌చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడారు. ఈ ప్రాంతంలో పాత్రికేయుల సంఘ భవన నిర్మాణం చేపడతామన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ విలేకరుల ఆరోగ్యభద్రతకు బీమా చెల్లిస్తానన్నారు. ఇటీవల చిత్రకళ రంగంలో కళారత్న అవార్డు అందుకున్న సుంకరి చలపతిరావును సత్కరించారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు ఎంవీ గిరి అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి మజ్జి రమేష్, పాత్రికేయులు గుప్తా, కార్పొరేటర్లు పీవీ సురేశ్, బళ్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, పుర్రె పూర్ణశ్రీసురేశ్, మాజీ కార్పొరేటర్ కలిదిండి బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.బీజేపీ నాయకులు జ్ఞానేశ్వర్, కోరమాండల్ ఎరువుల కర్మాగారం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నారాయణ, జనరల్ మేనేజర్ రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సీఎస్‌వో నారాయణపాత్రుడు. హార్బర్ సర్కిల్ ఏసీపీ కాళీదాస్, మల్కాపురంలు సీఐ గొలగాని అప్పారావు, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ 96 వార్డు అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం



రాజేంద్రప్రసాద్‌ను అభినందిస్తున్న మేయరు శ్రీనివాసరావు

పెందుర్తి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 96 వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా పెంటకోట రాజేంద్రప్రసాద్ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. పెందుర్తిలో ఆదివారం వార్డు కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మేయర్ పీలా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై రాజేంద్రప్రసాద్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మేయర్ పీలా మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా టీడీపీలో యువతనేతగా అందించిన సేవలకు గుర్తింపుగా రాజేంద్రప్రసాద్‌కు ఈ అధ్యక్ష పదవి లభించిందన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో అతనికిఅండగా నిలిచి, రాజకీయ ఉన్నతికి సహకరిస్తానన్నారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మేయర్ బాటలోనే ఎంతో విశ్వాసంతో పార్టీలో పనిచేస్తానన్నారు. అనంతరం మేయరు రాజేంద్రప్రసాద్‌ని సత్కరించారు. కార్యకర్తలు, నేతలు రాజేంద్రప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సేనాపతి శంకర్రావు, బల్ల శ్రీనివాసరావు, అవగడ్డ అప్పలనాయుడు, కోరిబిల్లి సుందరరావు,గొంప త్రినాథ్, శరగడం బుజ్జి, ఆళ్ల రమేశ్, పీలా జితేంద్ర, నరిసమ్మ, వానపల్లి నరసింగరావు, కర్రి జగ్గారావు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ: సినీ నటుడు సుమన్



కరాటే విద్యార్థికి ట్రోఫీ అందజేస్తున్న సుమన్

మల్కాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కరాటే ఆత్మరక్షణకు దోహదపడుతుందని సినీ నటుడు సుమన్ అన్నారు. యారాడ గ్రామంలో ఆంధ్ర షోటోఖాన్ కరాటే -డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ పాల్గొని మాట్లాడారు. కరాటే సాధనతో సంపూర్ణమైన ఆరోగ్యం చేకూరుతుందన్నారు. కరాటే విద్య అభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలని కోరారు. యారాడ గ్రామంలో ఇటువంటి పోటీలు నిర్వహించడం ఇది తొలిసారి అని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, తెలుగుదేశం గ్రామ నాయకుడు తొత్తరి శ్రీనివాసరావు (చిట్టి), 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేశ్ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: సీఐ

మల్కాపురం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) రౌడీషీటర్లు సక్రమంగా లేకపోతే చట్టపరమైన కఠినమైన చర్యలు తీసుకుంటామని మల్కాపురం పోలీసు స్టేషన్‌సీఐ గొలగాని అప్పారావు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌పరిధిలో ఉన్న పలువురు రౌడీషీటర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు.

పెందుర్తి: రౌడీ షీటర్లు తమ పరిధి దాటి వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కేవీ సతీశ్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఆదివారం పోలీసు స్టేషన్‌లో హాజరుకావాలన్నారు. సత్ప్రవర్తనతో ఆనందంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.